జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janasakthionline.com

సంపుటి : 47 సంచిక : 2 విజయవాడ 20-5-2014 పేజీలు : 8 వెల : రు 5.00

మార్పును గమనించగలరు

జనశక్తి వెబ్‌సైట్ అడ్రస్ www.janashaktionline.comకు బదులుగా www.janasakthionline.comగా మారింది. దయచేసి గమనించగలరు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ కాలంలో మున్నెన్నటికంటే ప్రాధాన్యత సంతరించుకున్న కార్మికవర్గ దీక్షాదినం 'మేడే'

గడిచిన 127 సంవత్సరాలుగా ప్రపంచవ్యాపితంగా కార్మికులకు, కష్టజీవులకు మేడే స్ఫూర్తిదాయకంగా వుంటూ వస్తున్నది. శ్రామికులు తమ జీవన, పని పరిస్థితుల మెరుగుదలకోసం; తామంతా ఒక వర్గంగా ఐక్యమై, సంఘటితంగా – అసమానత్వం, దోపిడీతో కూడిన పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి, అసమానతలు, దోపిడీలేని సమాజాన్ని, వర్గరహిత కమ్యూనిస్టు సమాజాన్ని స్థాపించేందుకు, చరిత్ర తమ భుజాలపై వుంచిన కర్తవ్యాన్ని పరిపూర్తి చేసేందుకు మేడే స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

ఈనాటి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ కాలంలో కూడా, మేడే ప్రాధాన్యత, ప్రాసంగికత, అవసరం ఏమాత్రం తగ్గకపోగా, మరింతగా పెరిగింది. సూపర్ లాభాల సముపార్జనే తన ప్రధాన కేంద్రీకరణగా పెట్టుబడిదారీ విధానం నయా ఉదారవాద ఆర్థిక విధానాల రూపంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణగా పునరుద్ధరించబడి తన దోపిడీని తీవ్రంచేస్తున్న నేడు, ప్రపంచవ్యాపితంగానున్న కార్మికవర్గానికి మేడే మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నదిగా వుంది.

సోవియట్ యూనియన్ కుప్పకూలిన అనంతరకాలంలో ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ తనకు ప్రత్యామ్నాయమే లేదని విర్రవీగుతోంది. దీనితో పెట్టుబడిదారీ విధాన ఉత్పత్తికే చెందిన ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలతో–ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానం, తాత్కాలిక ఉద్యోగాలు, పాక్షిక ఉద్యోగాలు, జీరో అవర్ అవసరాలు, వలస కార్మికులచే వెట్టిచాకిరీ వంటి రూపాల్లో నికృష్ట శ్రమ దోపిడీ విధానాలనుసరిస్తూ– పెట్టుబడిదారీ విధానం కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోంది.

పెట్టుబడిదారీ విధానమే అత్యంత మంచి వ్యవస్థగా ప్రపంచ పెట్టుబడిదారుల ఆడంబర ప్రకటనలు – అమానవీయ అభివృద్ధితో నయా ఉదారవాద ఆర్థిక విధానాల ఘోరమైన దోపిడీ కారణంగా – ప్రపంచవ్యాపిత కార్మిక ప్రజానీకపు వాస్తవ అనుభవంలో, అవాస్తవికమైనవిగా నిరూపితమయ్యాయి. అంతేగాక, భూ మండలంపై నుండి పెట్టుబడిదారీ వ్యవస్థను సంపూర్ణంగా నిర్మూలించాల్సిన అవసరాన్ని ఈ పరిస్థితులు నొక్కి చెప్తున్నాయి.

ఎడతెగని సంక్షోభం

ప్రపంచవ్యాపితంగా ఆకలి, పేదరికం పెరిగిపోతోంది. అసమానతలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. నిరుద్యోగం విషవలయంగా విస్తరిస్తోంది. విద్యా, వైద్య సౌకర్యాలు మృగ్యమై నానాటికీ ప్రపంచ ప్రజానీకపు జీవితాలు కుంచించుకుపోతున్నాయి. సాంకేతికరంగంలో ముందంజ గురించి, ప్రత్యేకించి సమాచార సాంకేతిక రంగంలో సాగించిన అభివృద్ధి గురించి సాగించే భారీ ప్రచారం, ప్రకటనలేవీ కార్మిక ప్రజానీకపు జీవితాలలో ఏరకమైన అభివృద్ధినీ తీసుకురాలేకపోయాయి. దీనికి భిన్నంగా, సాంకేతికాభివృద్ధి – కార్మికుల శ్రమశక్తిని, వారు సృష్టించిన సంపదను దోచుకునేందుకు బడా పెట్టుబడికి మరియు కార్పొరేషన్లకు మరింతగా అవకాశాలను పెంచింది.

ప్రపంచ కార్మిక సంస్థ పేర్కొన్న ప్రకారం ప్రతి సంవత్సరం 10 లక్షల మంది యువజనులు నిరుద్యోగ శ్రేణులలో జతకలుస్తున్నారు. ప్రపంచవ్యాపితంగా 15-24 సంవత్సరాల వయో బృందంలో నిరుద్యోగిత 13.1 శాతం అంటే వయోజన జనాభా నిరుద్యోగితకు రెట్టింపుగా వుంది. అనేక దేశాలలో విద్య, ఉద్యోగం, శిక్షణా లేని యువజనుల సంఖ్య పెరుగుతోంది. 2013 సంవత్సరంలోనే 50 లక్షలమంది యువజనులు నిరుద్యోగ శ్రేణులలో చేరారు.

సౌభాగ్యవంతమైన దేశంగా చెప్పబడుతున్న అమెరికాలో నిరుద్యోగం పెరుగుతోంది; పేదరికం వెంటాడుతోంది. అక్కడి ప్రభుత్వం ఇతర సంపన్న దేశాలను మించి సామాజిక సంక్షేమంలో కోతలు విధిస్తూ, కార్మికులచే మరింత అధిక సమయం పనిచేయించే విధానాలతో కష్టజీవుల పట్ల కరకుగా వ్యవహరిస్తోంది.

ఇటీవలికాలపు ఓ అధ్యయనం ప్రకారం అమెరికాలో ఆర్థిక సంక్షోభం కారణంగా 48 లక్షల పైబడిన ప్రజానీకం ఆకలిబారిన పడుతున్నారు. లక్సెంబర్గ్, ఫ్రాన్స్, ఆస్ట్రియా, బెల్జియం, నెదర్లాండ్స్, ఐర్లాండ్, న్యూజిలాండ్, కెనడా దేశాల కంటే అమెరికా కార్మికులకు కనీస వేతనాలు తక్కువగా వున్నాయని ఓసిఇడి అందిస్తున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. గత 30 సం॥ల కాలంలో అసమానతలు పెచ్చుమీరిపోయాయి. దాదాపు 40శాతం అమెరికా బాలలు పేదరికంలోనో లేదా పేదరికం దాపుల్లోనో జీవిస్తూ సంపన్నుల బిడ్డలతో పొంతనలేక విద్యా, ఉద్యోగాలను పొందలేకపోతున్నారు. పూర్తికాలపు ఉద్యోగాలు మరియు నాణ్యతగల ఉద్యోగాలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. ఒబామా కేర్ పేరిట వైద్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టడంతో, ఉద్యోగుల ఆరోగ్య రక్షణకు చెల్లించాల్సిన బీమా ప్రీమియంనుండి తప్పుకోవటానికి అనేక యాజమాన్యాలు పూర్తికాలపు ఉద్యోగస్థులందరినీ పార్ట్‌టైమ్ ఉద్యోగులుగా కుదించివేస్తున్నాయి. వాల్‌మార్ట్, కెల్లి సర్వీసెస్‌లు పూర్తికాలపు ఉద్యోగాలలో కోత విధించే పద్ధతిని; పార్ట్‌టైమ్ సిబ్బంది నియామకాన్ని ప్రారంభించాయి. ఇది అమెరికా అంతటా వ్యాపించింది. 2013 జూన్‌లోనే 2,40,000 మంది పూర్తికాలపు ఉద్యోగులు కోతకు గురయ్యారు. సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి కార్పొరేషన్ల చేతికి అందుబాటులోకి రావటంతో వారు భారీస్థాయిలో ఉద్యోగాలలో కోత విధిస్తున్నారు. పూర్తికాలపు ఉద్యోగుల స్థానంలో పార్ట్‌టైమ్ ఉద్యోగుల పెరుగుదలతో దీర్ఘకాల నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోయింది. ఈవిధంగా అమెరికాలో కార్మికులు కార్పొరేషన్లచే బలవంతంగా 'ఐడిల్‌నెస్ ట్రాప్స్'లోకి నెట్టబడుతున్నారు. అమెరికాలో మధ్యతరగతి స్థిరమైన ఉద్యోగాలులేక తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటున్నారు. కంప్యూటరీకరణ, గ్లోబలీకరణలు నైపుణ్య కార్మికుల అవసరాన్ని ఎన్నోరెట్లు తగ్గించివేశాయి. ఒకనాడు అమెరికాకే గర్వకారణంగా భావించే డెట్రాయిట్ నగరం దివాళా తీసి, ఉద్యోగ విరమణ చేసిన నగర కార్మికులు 31 వేలమందికి సంబంధించిన వైద్య సౌకర్యాలు, పెన్షన్లపై తీవ్రమైన దెబ్బకొట్టింది. చికాగో, లాస్ ఏంజిల్స్, సిన్సిన్నాటి మొదలైన నగరాలన్నీ దివాళా తీసేందుకు సిద్ధంగా వున్నాయని నివేదికలు తెలియపరుస్తున్నాయి. ప్రైవేటు విభాగంలోని ఉక్కు పరిశ్రమ, విమానయానం, ఆటోరంగం, గనుల పరిశ్రమలలో కూడా కార్మికుల ఉద్యోగ విరమణానంతర సౌకర్యాలలో గణనీయంగా కోత విధించారు. అమెరికా ప్రభుత్వం అమలుచేస్తోన్న కోతల విధానం ఫలితంగా 20 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు.

(తరువాయి 4వ పేజీలో)

కా॥ సురేంద్ర సింగ్ కతియార్‌కు విప్లవ జోహార్లు



సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు, వృద్ధతరానికి చెందిన సీనియర్ కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ సురేంద్రసింగ్ కతియార్ (81సం॥లు) 2014 ఏప్రిల్ 18న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం–లక్నోలోని ఓ ఆసుపత్రిలో ఊపిరితిత్తుల క్యాన్సర్‌వ్యాధికి చికిత్స పొందుతూ మరణించారు.

చిన్న వయసులోనే కా॥సురేంద్రసింగ్ కతియార్, భగత్‌సింగ్ సహచరుడైన గయాప్రసాద్ ద్వారా భగత్‌సింగ్ విప్లవ, దేశ భక్తియుత భావాలలో ప్రభావితులై ఆ వైపుగా ఆకర్షింపబడ్డారు. కా॥ కతియార్ 1955లో సిపిఐ సభ్యత్వం పొందారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహింపబడే అనేక పోరాటాలు, కార్యకలాపాలన్నింటిలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. 1963లో తెనాలిలో జరిగిన పార్టీ అఖిలభారత ప్లీనంలో ఉత్తరప్రదేశ్ నుండి ప్రతినిధిగా పాల్గొన్నారు. రివిజనిస్టు రాజకీయాలను వ్యతిరేకించి, సిపిఐ నుండి విడగొట్టుకొని ఆయన సిపిఐ(ఎం)లో చేరారు. సిపిఐ(ఎం) కాన్పూరు జిల్లాకమిటి సభ్యులయ్యారు.

కామ్రేడ్ సురేంద్రసింగ్, నగ్జల్‌బరి రైతాంగ తిరుగుబాటుతో, తద్వారా దేశంలో ముందుకొచ్చిన విప్లవ రాజకీయాలతో గాఢంగా ఉత్తేజం పొందారు. నగ్జల్బరీ పోరాటాన్ని, అది ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయాలను స్వాగతిస్తూ తాను సభ్యునిగావున్న కాన్పూరు జిల్లా కమిటిలో ఆయన ఓ తీర్మానాన్ని ప్రతిపాదించారు. దీనితో జిల్లాకమిటీలో విభజన జరిగింది. కామ్రేడ్ సురేంద్రసింగ్ కమ్యూనిస్టు విప్లవకారుల పక్షం తీసుకున్నారు. సమన్వయ కమిటి కాలంలో బస్తీగోండా ప్రాంతంలో ఆయన పూర్తికాలం కార్యకర్తగా పనిచేశారు.

చారుమజుందార్ ప్రబోధించిన అతివాద, ఒంటెత్తు రాజకీయాలు సరైనవికావని, ఆమోదనీయంకావని భావించిన ఆయన కొంతకాలం స్తబ్దంగా వుండిపోయారు. అదే సమయంలో, ఆయన మరియు ఆయనతోపాటుగా విప్లవ రాజకీయాలతో ఆయన వెన్నంటి నిలచిన ఆయన జీవిత సహచరిణి 'పెకింగ్ రివ్యూ' ఆంగ్లపత్రికను హిందీ భాషలోకి అనువదించి కామ్రేడ్స్‌కు అందజేసేవారు. కా॥సురేంద్రసింగ్ వ్యవసాయం చేపట్టి కొద్దిపాటి భూమిలో తీవ్రంగా శ్రమించారు. వారు తమ పిల్లలు ముగ్గురిని క్రమశిక్షణాయుతంగా, కమ్యూనిస్టు వాతావరణంలో పెంచి పెద్దజేశారు. ఈ కాలంలోనూ ఆయన కమ్యూనిస్టు విప్లవకారులతో నిరంతర సంబంధాలలో వుంటూ, కాన్పూరులో చురుగ్గా ఉద్యమాలలో పాల్గొన్న కామ్రేడ్స్‌కు వివిధ రూపాలలో సహాయ సహకారాలందించేవారు.

కామ్రేడ్ కానూసన్యాల్ నాయకత్వంలో ఓసిసిఆర్ ఏర్పాటు కామ్రేడ్ సురేంద్రసింగ్‌కు పునరుత్తేజం కలిగించింది. ఓసిసిఆర్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రకమిటి ఏర్పడినపుడు ఆయన అందులో చేరారు. ఓసిసిఆర్ రాష్ట్ర పత్రిక 'చింగారి'కి ఆయన సంపాదకునిగా వుండి కృషిచేశారు. తర్వాత కామ్రేడ్ కానూసన్యాల్ నాయకత్వంలో సిఓఐ(ఎం-ఎల్) ఏర్పాటులో ఆయన భాగస్వాములయ్యారు. ఇది చీలికకు గురైనపుడు కానూసన్యాల్ నాయకత్వంలోని సిఓఐ(ఎమ్ఎల్) పక్షాన నిలిచి కేంద్రకమిటి సభ్యులుగా కృషిచేశారు. పార్టీ కేంద్రపత్రిక 'క్లాస్ స్ట్రగుల్' నిర్వహణా బాధ్యతలను నిర్వర్తించారు. ఉత్తరప్రదేశ్‌లో వివిధ బాధ్యతలను నిర్వహించటంతోపాటు, ఆయన మృతిచెందే నాటికి సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులుగా వున్నారు. సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర హిందీ పత్రిక 'వర్గ సంఘర్ష్‌కా పుకార్' సంపాదకవర్గ సభ్యులలో ఒకరిగా ఆయన వున్నారు.

కామ్రేడ్ సురేంద్రసింగ్ అంకితభావం కలిగిన, క్రమశిక్షణ కలిగిన కామ్రేడ్. గత చాలా సంవత్సరాలుగా ఆయన అనేక ఇబ్బందులను, అనారోగ్యాన్ని లెక్కచేయకుండా అంకితభావంతో బాధ్యతలను నిర్వర్తిస్తూ వచ్చారు. ఆయన ఆసుపత్రిలో చేరటానికి కొద్దిరోజుల ముందు చాలా దూరప్రయాణంచేసి కేంద్రకమిటీ సమావేశాలకు హాజరై, ఒక ముఖ్యమైన రాజకీయ కర్తవ్యాన్ని పరిపూర్తిచేశారు.

దివంగత కామ్రేడ్ సురేంద్రసింగ్ కతియార్‌కు విప్లవ జోహార్లర్పిస్తున్నాం. ఆయన జీవితం, ఆయన అందించిన తోడ్పాటు కామ్రేడ్స్‌కు ఎల్లవేళలా అనుసరణీయంగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి.

కామ్రేడ్ సురేంద్రసింగ్ కతియార్ జీవిత సహచరిణికి, వారి కుటుంబ సభ్యులకు సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తోంది. వారి దుఃఖంలో, బాధలో వారికి అండగా నిలుద్దాం. కామ్రేడ్ సురేంద్రసింగ్ కతియార్ జ్ఞాపకాలను సదా పదిలపరుచుకుందాం. ఆయనకు అరుణారుణ జోహార్లు అర్పిద్దాం.

20-4-14

కేంద్రకమిటి

సి.పి.ఐ(ఎం-ఎల్)

కామ్రేడ్ సి.హెచ్. నాగూర్‌కు విప్లవ జోహార్లు

విప్లవకారుడు, ట్రేడు యూనియన్ నాయకుడు, సిపిఐ(ఎం-ఎల్) సభ్యులు కామ్రేడ్ సి.హెచ్. నాగూర్ (76 సం॥లు) 10-5-14న కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌లోని వారి స్వగృహంలో అనారోగ్యంతో మృతిచెందారు. కా॥ నాగూర్ మరణంపట్ల 'జనశక్తి' తీవ్ర సంతాపం వ్యక్తంచేస్తూ ఆ కామ్రేడ్‌కు జోహార్లర్పిస్తోంది.

కామ్రేడ్ సి.హెచ్.నాగూర్ పశ్చిమగోదావరి జిల్లా, తణుకు తాలూకా పిట్టల వేమవరం గ్రామంలో 1938వ సంవత్సరంలో జన్మించారు. ఆనాడు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన భూస్వామ్య, పెత్తందార్ల దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా సాగిన పోరాటాలు చిన్న వయసులోనే కామ్రేడ్ నాగూర్‌పై మంచి ప్రభావాన్ని పడవేసి, ఆయనను కమ్యూనిస్టు అభిమానిగా మార్చాయి.

కామ్రేడ్ నాగూర్ రేడియాలజిస్టుగా శిక్షణ పూర్తిచేసుకొని మంగళగిరి టి.బి.శానిటోరియంలో మొదటగా ఉద్యోగం పొందారు. హాస్పిటల్ కార్మికుల, ఉద్యోగుల హక్కులకోసం, వారి సంక్షేమంకోసం ఆయన అనేక ఆందోళనలు నిర్వహించి, మిలిటెంట్‌గా నాయకత్వం వహించి విజయాలు సాధించారు. తదనంతర కాలంలో ఇఎస్‌ఐ ఉద్యోగుల, ఆసుపత్రి సిబ్బంది, కార్మికుల సమస్యలపై నిజాయితీగా స్పందించి, అనేక ఆందోళనలు సాగించి వారి అభిమానాన్ని చూరగొన్నారు.

మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనావిధానంపట్ల సంపూర్ణ విశ్వాసాన్ని కడదాకా కలిగివున్న కామ్రేడ్ నాగూర్, పార్టీ కామ్రేడ్స్‌పట్ల ముఖ్యంగా పార్టీ బాధ్యతలు నిర్వహిస్తూ, కష్టనష్టాలకోర్చి కృషిసాగిస్తున్న కామ్రేడ్ పట్ల ఎంతో అభిమానాన్ని ప్రదర్శించేవారు. వారికి వివిధ రూపాల్లో సహాయ, సహకారాలందించేవారు.

క్రిస్టియన్ మతం స్వీకరించిన కుటుంబ సభ్యులు, ఆ ప్రభావంలోవుండి తాను నమ్మిన కమ్యూనిస్టు పద్ధతుల్లోగాక మత సాంప్రదాయాల ప్రకారం తన మరణానంతరం అంత్యక్రియలు నిర్వహిస్తారని కా॥నాగూర్ ముందుగానే పసిగట్టారు. మరణించటానికి దాదాపు నెలరోజుల ముందు అనారోగ్యంతో వుండికూడా, ఎర్రచొక్కాను ధరించి, తన ఇంటివద్దనే పార్టీ కామ్రేడ్స్ సమక్షంలో తానే ఎర్రజెండాను ఎగురవేసి, ఎర్రజెండాపట్ల తన ప్రగాఢ విశ్వాసాన్ని ఆయన వ్యక్తంచేశారు.

అమరుడు కామ్రేడ్ నాగూర్‌కు 'జనశక్తి' విప్లవ జోహార్లర్పిస్తోంది.

సిపిఐ(ఎం-ఎల్) అభిమాని కొప్పుల రాహుల్‌కు జోహార్లు

సిపిఐ(ఎం-ఎల్) రాజకీయ అభిమాని, సానుభూతిపరుడు కొప్పుల రాహుల్(48 సం॥లు) గుండెపోటుతో 7-5-14 ఉదయం హఠాత్తుగా మృతిచెందారు. సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥కొప్పుల కోటయ్య పెద్ద కుమారుడు రాహుల్.

రాహుల్ తల్లి అనారోగ్యంతో మృతిచెంది పదినెలలు అవుతోంది. ఇంతలో రాహుల్ హఠాన్మరణం అందరినీ కలచివేసింది. రాహుల్ కృష్ణలంకలో సత్యంహోటల్ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించేవారు.

విద్యార్థిగా వున్న కాలంలో రాహుల్ సంఘకార్యక్రమాలలో పాల్గొన్నాడు. విజయవాడలో-పార్టీ మరియు ప్రజాసంఘాల సభలు, వివిధ సమావేశాల సందర్భంగా సహాయ, సహకారాలందజేసేవాడు.

రాహుల్‌కు భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. రాహుల్ మృతిపట్ల 'జనశక్తి' సంతాపాన్ని వ్యక్తంచేస్తోంది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియబరుస్తోంది.

కా॥ మండ్ల సుబ్బారెడ్డి వర్ధంతి సభ

వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥ అంజమ్మ

బందరు, 24-4-14 :

రైతుకూలీపోరాట యోధుడు, విప్లవ కమ్యూనిస్టునేత కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి వర్ధంతి సందర్భంగా సిపిఐ(ఎం-ఎల్) బందరు ఏరియాశాఖ ఆధ్వర్యంలో స్థానిక అరుణోదయకాలనీలో కామ్రేడ్ ఎం.ఎస్.స్మారక స్థూపంవద్ద తొలుత నివాళులర్పించిన అనంతరం సభ జరిగింది. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకురాలు కా॥పామర్తి అంజమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥యద్దనపూడి సోని మాట్లాడుతూ జీవిత పర్యంతం పీడిత ప్రజాఉద్యమ కృషి సాగించిన, కమ్యూనిస్టు విప్లవోద్యమంలో నిబద్ధతతో త్యాగపూరిత జీవితాన్ని గడిపిన కామ్రేడ్ ఎం.ఎస్.జీవితాచరణను ఆదర్శంగా తీసుకొని ముందుగా సాగాలన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో ప్రజల కర్తవ్యాలను వివరించారు.

ఈ సభలో ఇంకా కామ్రేడ్స్ ఈపూరి రాంబాబు, కొప్పినేని ఉమామహేశ్వరరావులు పాల్గొని ప్రసంగించారు. కాలనీ ప్రజానీకం, శ్రామికులు పెద్దసంఖ్యలో సభలో పాల్గొన్నారు. ✶

కా॥ చల్లపల్లి నారాయణరావు వర్ధంతి సభ

చల్లపల్లి, 12-5-14 :

చల్లపల్లి జమిందారీ వ్యతిరేక పోరాటయోధుడు, అమరుడు కామ్రేడ్ చల్లపల్లి నారాయణరావు వర్ధంతిని పురస్కరించుకొని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. కృష్ణాజిల్లా - మండల కేంద్రమైన చల్లపల్లిలోని కా॥ నారాయణరావు స్థూపం వద్ద; తలగడదీవి కొత్తపాలెం నారాయణపురం అమరుల స్థూపంవద్ద తొలుత కామ్రేడ్స్, కార్యకర్తలు, ప్రజానీకం నివాళులర్పించారు.

ఈ రెండు ప్రాంతాల్లో జరిగిన సభలలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కామ్రేడ్స్ జగన్, లీలామనోహర్, రాంబాబులు మాట్లాడారు. భూమి భుక్తి విముక్తి లక్ష్యంగా సాగిన చల్లపల్లి జమిందారీ వ్యతిరేక పోరాటంలో 1950లో కా॥ నారాయణరావును కాల్చిచంపిన విషయాన్ని గుర్తుచేశారు. భూమిసమస్య కేంద్రంగా వ్యవసాయ విప్లవ ప్రాధాన్యత నేడు మరింతగా పెరిగిందని, అభివృద్ధిపేరిట రైతాంగం నుండి గుంజుకుంటున్న భూములను నిలుపుకోవటానికి సమైక్యపోరాటం సాగించాలన్నారు. ఎన్‌వైయస్ తదితర ప్రజాసంఘాల నాయకులు, స్థానిక ప్రజలు ఈ సభలలో పాల్గొన్నారు. ✶

అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతాంగానికి వెంటనే పరిహారం అందించాలి

రైతుకూలీసంఘం (ఆం.ప్ర) డిమాండ్

రైతాంగంపై ప్రకృతి మరోసారి విరుచుకుపడింది. రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాల వలన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఉభయగోదావరి జిల్లాల్లో లక్షన్నర ఎకరాల్లో వరితోపాటు వేలాది ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న, మామిడి, సపోట, అరటి, పసుపు, పొగాకు, బొప్పాయి, తమలపాకులు, కూరగాయల పంటలకు నష్టం జరిగి రైతాంగం వందలకోట్ల రూపాయలు కోల్పోయారు. తూర్పు గోదావరి జిల్లాలోనే 70 వేల ఎకరాల్లో వరిపంట, 10 వేల ఎకరాల్లో మామిడి పంటలకు అపార నష్టం జరగగా, కృష్ణాజిల్లాలో 11,310 ఎకరాల్లో కోసిన వరి ఓదెలు నీటమునగగా 6 వేల ఎకరాల పైరు నేలవాలి ముంపుకి గురైంది. మామిడి పంటకు 10 శాతం నష్టం జరగగా, 14,465 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నది. కరీంనగర్ జిల్లా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో 5 వేల క్వింటాళ్ళు, నల్గొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో 4 వేల క్వింటాళ్ళ ధాన్యం వర్షపు నీటికి తడిసిపోయింది. కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ వేలాది క్వింటాళ్ళ ధాన్యం తడిసిపోయింది. అనేక మార్కెట్ యార్డుల్లోని మిర్చి వర్షపు నీటిలో తేలియాడింది.

పాలకుల విధానాలతో సేద్యపు ఖర్చులు పెరిగి, పంటలకు న్యాయమైన ధర లభించక అప్పులపాలౌతున్న రైతాంగానికి ప్రకృతి వైపరీత్యాలతో అపార నష్టాలు తోడై వారిని సంక్షోభం సుడిగుండంలోకి నెట్టి, ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నాయి.

మండు వేసవిలో కురిసిన అకాల వర్షాలకు తోడు, అధ్వాన్నస్థితిలోని డ్రైనేజీ వ్యవస్థ, రైతుల పంటనష్టాన్ని మరింత తీవ్రం చేస్తున్నది. దశాబ్దాల తరబడి డ్రైనేజీ వ్యవస్థను పట్టించుకోని పరిస్థితుల్లో కాల్వలు పూడిపోయి కొద్దిపాటి వర్షం వచ్చినా పంటలకు నష్టం జరుగుతున్నది. ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనా, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉంటే ముంపు నష్టతీవ్రతను నివారించవచ్చు. రైతాంగం ఆందోళన ఫలితంగా ప్రపంచబ్యాంక్ ఆర్థిక సహాయంతో కృష్ణా డెల్టా, సాగర్ ఆయకట్టుల ఆధునీకరణ చేపడుతున్నట్లు పాలకులు ప్రకటించి 6 సం॥ గడిచినా, కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా 30% పనులు కూడా పూర్తి కాలేదంటే కాల్వల ఆధునీకరణ ఏరకంగా సాగుతుందో వెల్లడవుతోంది.

ప్రకృతి నష్టాలను తగ్గించే విధానాలు చేపట్టని పాలక ప్రభుత్వాలు, నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవటంలోనూ మొండిచేయి చూపుతున్నాయి. అందుకు గవర్నరు పాలనా మినహాయింపుకాదు. చేతికి అందనున్న పంటలు కళ్ళముందే నీట మునుగుతుంటే, గుండెలు అవిసిపోయిన రైతాంగానికి, ప్రభుత్వం ప్రకటించే సహాయం వారిని అపహాస్యం చేస్తున్నది. వారు తిరిగి నిలబడే పరిస్థితికి దోహదపడటంలేదు. ఆ పరిహారం కూడా అత్యధికమంది రైతులకు అందని పరిస్థితి కొనసాగుతున్నది. నీలం తుఫాన్ నష్టబాధిత రైతులకు ప్రకటించిన సహాయం నేటికీ చాలామంది రైతులకు అందలేదు. గత నవంబర్ తుఫాన్ బాధిత రైతులదీ అదే పరిస్థితి. దీన్ని గమనిస్తే నేడు పంటలు నష్టపోయిన రైతులకు సహాయం ఎండమావిగానే కన్పిస్తుంది.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవటం భిక్ష విదిలించటంకాదనీ, అది రైతుల హక్కనీ ప్రభుత్వాలు గ్రహించాలి. నేటి అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఈ క్రింది సహాయకచర్యలు వెంటనే అమలుచేయాలి.

- వరి, మొక్కజొన్న, జొన్న పంటలు కోల్పోయిన రైతాంగానికి ఎకరానికి 15 వేలు పరిహారం చెల్లించాలి.
- మామిడి, అరటి, సపోట, కూరగాయలు మొదలైన రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించాలి.
- తడిసిన ధాన్యానికి న్యాయమైన ధర చెల్లించి ప్రభుత్వమే నేరుగా రైతుల నుండి కొనుగోలు చేయాలి.
- చిన్న, సన్నకారు రైతుల అన్నిరకాల అప్పులు రద్దుచేయాలి.
- యుద్ధ ప్రాతిపదికపై పంట-మురుగు కాల్వల మరమ్మత్తులు పూర్తిచేయాలి.

విజయవాడ
14-5-2014

యస్. ఝాన్సి
రాష్ట్ర అధ్యక్షులు
రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)

కా॥ పీతాశివన్నాధం వర్ధంతి సభ

వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥ నాగేశ్వరరావు

బందరు, 2-5-14 :

రైతుకూలీసంఘం జిల్లా నాయకుడు, గూండాల చేతుల్లో హత్యకు గురైన కామ్రేడ్ పీతాశివన్నాధం వర్ధంతిసభ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఇంగ్లీషుపాలెంలో కా॥ కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని మాట్లాడుతూ తీరప్రాంత బంజరు భూములను భూస్వామ్య పెత్తందార్లు ఆక్రమించుకొని, పేదలకు భూములు దక్కకుండా చేస్తున్న నేపధ్యంలో సంఘం ఆధ్వర్యంలో కా॥ పీతా శివన్నాధం నాయకత్వాన నిరుపేదలు పోరాడి, భూస్వాముల చర్యలను కొంతమేర నిలువరించారన్నారు. దీనితో కక్షగట్టిన భూస్వామ్య, పెత్తందార్లు, వారి అనుయాయులతో కా॥ శివన్నాధాన్ని హత్యగావించారంటూ ఆయనకు జోహార్లర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంకా కామ్రేడ్స్ జె. జగన్, అంజమ్మ, సుధాకరరావులు పాల్గొని ప్రసంగించారు. ✶



లాభార్జనే లక్ష్యంగా కార్మికుల ప్రాణాలను బలిపెట్టిన టర్కీ గని యాజమాన్యం, ప్రభుత్వం

టర్కీలోని బొగ్గుగనిలో జరిగిన విస్ఫోటనంలో 300 మందిపైగా దుర్మరణం చెందారని వార్తలు వెలువడ్డాయి. ఈ సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. టర్కీ దేశ చరిత్రలో ఇది అతిపెద్ద దుర్ఘటన. గని కార్మికుల కుటుంబీకులకూ, స్నేహితులకు పెను విషాదాన్ని కలిగించిన ఈ ఘటన పూర్తిగా నివారించగలిగిందనటంలో ఎలాంటి సందేహంలేదు. ఇది "నివారించలేని" ప్రమాదం కాదు. ప్రైవేటీకరణ, ప్రభుత్వ నిర్లక్ష్యం, అంతులేని లాభకాంక్ష కలిసి గనికార్మికుల ప్రాణాలను బలిగొన్నాయి. ప్రపంచ గని పరిశ్రమే ఒక వధ్యశాలగా మారింది. విక్టోరియా రాణి పాలనాకాలపు ఇంగ్లాండు, రాక్ ఫెల్లర్ పాలనా కాలపు అమెరికాలో వున్న నాటి పరిస్థితులకు నేటి గని పరిశ్రమ తిరోగమించింది. మొదటి ప్రపంచ యుద్ధంలో మృతిచెందిన వారి సంఖ్యను మించి ఆనాడు గనికార్మికులు ప్రమాదాలలో మరణించారు.

టర్కీలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని బొగ్గు గనులను ప్రైవేటీకరించమని అంతర్జాతీయ ద్రవ్య నిధి రూపొందించిన సంస్కరణల కార్యక్రమం నిర్దేశించింది. దీనిప్రకారం టర్కీలోని బొగ్గుగనులను ప్రైవేటురంగానికి ధారాదత్తం చేశారు. 2005 నుండి 2010 మధ్యన బొగ్గు తవ్వకాలలో మూడవ వంతుకుపైగా ప్రైవేటు కంపెనీల పరమయ్యింది. తమ అంతర్జాతీయ యజమానుల ఆదేశాల మేరకు ఈ ప్రైవేటు గని కంపెనీలు భద్రతా ఏర్పాట్లతోసహా ఖర్చులు తగ్గించాయి. వాటాదారులైన పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే లక్ష్యంతోనే ఇది జరిగింది. దీని ఫలితంగా గని కార్మికులకు భద్రత కరువయ్యింది. ప్రస్తుత ప్రమాదాన్ని లెక్కించకుండానే, టర్కీలో 2000 సంవత్సరం తర్వాత 1308 గని ప్రమాదాలు జరిగాయి. సగటున 10 లక్షల టన్నుల బొగ్గు తవ్వి తీస్తే, ఏడుగురు గని కార్మికులు మృతిచెందారు అని ఇకానిమిక్ రిసెర్చ్ ఫౌండేషన్ ఆఫ్ టర్కీ నివేదిక తెలిపింది.

ప్రస్తుత విస్ఫోటనం జరిగిన సోమా గనులను 2005లో ప్రైవేటీకరించారు. సోమా కోముర్ ఇస్‌లెట్‌మెలెరీ అన్న కంపెనీ ఇప్పుడు సోమా గనుల యజమాని. ఈ కంపెనీ ముఖ్య అధికారి ఆల్ప్ గుర్కాన్ రెండేళ్ళ క్రితం హుర్రియత్ డైలీ పత్రిక కిచ్చిన ఇంటర్వ్యూలో బొగ్గు తవ్వకం ఖర్చును టన్నుకు 130 డాలర్ల నుండి 24 డాలర్లకు తగ్గించామని చెప్పుకున్నాడు.

ఈ గొప్ప విజయాన్ని కార్మికుల భద్రతను పణంగాపెట్టి సాధించారని ఛాంబర్ ఆఫ్ ఆర్కిటెక్ట్ అండ్ ఇంజనీర్స్ అన్న సంస్థ రూపొందించిన "గనులలో పని ప్రమాదాలు" అన్న 152 పేజీల నివేదిక తెలిపింది. "అవసరమైన పరిశోధన పూర్తయ్యేవరకు సోమాగనిలో ఉత్పత్తి సాగించరాదు. అనుభవం లేకుండా ఉత్పత్తి సాగించటం ప్రమాదాలకు దారితీయవచ్చు" అని ఆ నివేదిక పేర్కొంది. మిథేన్ వాయువు ఎక్కువగా వున్నందున సోమా గని ప్రత్యేకించి ప్రమాదకారకంగా వున్నదని ఆ నివేదిక చెప్పింది. ఊపిరి పీల్చుకునేందుకూ, తప్పించుకునేందుకూ ప్రత్యామ్నాయ దారుల ఏర్పాటు లేనందున, ప్రమాదం జరిగితే కార్మికులను రక్షించటం దాదాపు అసాధ్యంగా మారిందని కూడా నివేదిక పేర్కొంది. ప్రమాదకర వాయువులను కనుగొనటం, సరైన సమయంలో వాటి నుండి రక్షణ చర్యలు తీసుకోవటం కష్టతరం గనుక గనుల నుండి కార్మికులను వెలికిరప్పించే తక్షణ చర్యలను పటిష్టం చేయాలి అని కూడా నివేదిక సూచించింది.

ఈ నివేదిక వ్యక్తం చేసిన అభిప్రాయాలే సోమాగనిలో నిజమయ్యాయి. సోమా గనిలో వున్న ప్రమాదకర పని పరిస్థితుల గురించి కార్మికుల ఫిర్యాదులు అసంఖ్యాకంగా అందటంతో స్థానిక ప్రతిపక్ష నాయకులు వెంటనే విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కానీ ప్రధానమంత్రి ఎర్డొగాన్ ఈ డిమాండును తిరస్కరించాడు. పాలక ఏకేపి పార్టీ ప్రతినిధి, దేశంలోకెల్లా అత్యంత భద్రమైనవి సోమా గనులని ప్రకటించాడు.

టర్కీ ప్రభుత్వం కార్మికుల భద్రతపట్ల ఎంత వ్యతిరేకతను కలిగివుందంటే "బొగ్గుగనుల్లో ఇది మామూలే. ప్రమాదరహిత పని అన్నదేదీ వుండదు" అని ప్రధానమంత్రి మాట్లాడాడు. ఇంతేకాక "గనులలో ఇలాంటి ప్రమాదాలు 1860లలోనూ, 1890లలోనూ, 1900లలోనూ ఇంగ్లాండు, అమెరికాలలో జరిగాయంటూ "ఇలాంటివి జరుగుతాయి. పనిలో ప్రమాదాలన్నవి ఎప్పుడూ ఉంటాయి"ని ప్రధానమంత్రి అన్నాడు.

అయితే టర్కీ ప్రజలలో ఆగ్రహం పెల్లుబికింది. సోమాగనులను చూడటానికి వచ్చిన ప్రధానమంత్రికి వారు ప్రదర్శన ద్వారా నిరసన తెలిపారు. ప్రధానమంత్రి స్వయంగా ఒక నిరసనకారుడి చెంపపై కొట్టడంతో ఆ వీడియో చూసిన టర్కీ ప్రజలు దేశవ్యాప్తంగా నిరసనలు తెలిపారు. పోలీసులు టియర్ గ్యాసు, రబ్బరు బుల్లెట్లు, నీటి ఫిరంగులతో ప్రజలపై విరుచుకుపడ్డారు.

ప్రజల నిరసన పెరగటంతో, ప్రమాదం జరిగితే కార్మికులు తలదాచుకునే గది నిర్మించలేదని కంపెనీ అంగీకరించింది. అలాంటి గదిని నిర్మించే క్రమంలో తామున్నామంటూనే, అలా నిర్మించాలని చట్టంలో లేదని కంపెనీ సమర్థించుకుంది.

సోమా గనిలో ప్రమాదానికి అసలు కారణమేమిటో తెలియరాలేదు. కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయి, వాయువు మండిందనీ, కరెంటు సరఫరా ఆగి ఎలివేటర్లు పనిచేయక కార్మికులు ఊపిరాడక చనిపోయారని కంపెనీ, ప్రభుత్వమూ మొదట ప్రకటించాయి. కనుక ఈ ప్రమాదంలో "మా నిర్లక్ష్యం పాత్ర ఏమీ లేద"ని కంపెనీ ప్రతినిధి ప్రకటించాడు.

అయితే ఛాంబర్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ "కంపెనీ చెబుతున్నట్లు ట్రాన్స్‌ఫార్మరు వల్ల ప్రమాదం జరగలేద"నీ, ఈ ప్రమాదం ఒక "హత్యాకాండ" అని ప్రకటించింది. ప్రమాదం తర్వాత తాము గనిని పరిశీలించగా ప్రమాదకర వాయువులను కనుగొనే పరికరాలు తగినన్ని లేవనీ, వున్నవి కూడా పాతపడిపోయి సరిగా పనిచేయని స్థితిలో వున్నాయనీ తెలిపింది. లోతైన పొరలలో వాయువులు మండి, బొగ్గు తగలబడి, గాలి సరఫరా సొరంగాలన్నీ మంటలు, పొగతో నిండిపోవటంతో ప్రమాదం జరిగిందని వారు వాదించారు.

లాభార్జనే ప్రధానంగా కార్మికుల భద్రతను బలిపెట్టిన ఫలితమే సోమా గని ప్రమాదానికి మూల కారణమన్నది స్పష్టం. ఇది - అంతర్జాతీయ ద్రవ్య నిధి టర్కీపై రుద్దిన సంస్కరణల కార్యక్రమం ఫలితమేనన్నదీ స్పష్టమే.

19వ శతాబ్దపు గని కార్మికుల దుర్భర పరిస్థితులకు నేటి గని పరిశ్రమను తిరోగమింప చేయటానికే ప్రపంచ పెట్టుబడిదారీ వర్గం పూనుకున్నది. 1860, 1890లలో ఇలాంటి ప్రమాదాలు ఇంగ్లాండు, అమెరికాల్లో కూడా జరిగాయనీ టర్కీ ప్రధాని అనాలోచితంగా అనలేదు. ఆనాటి దుర్భర పరిస్థితులను తిరిగి నెలకొల్పి, గనికార్మికుల శ్రమను నిలువుదోపిడీ చేయాలన్న తమ లక్ష్యాన్నే ఇలా బయటపెట్టాడు.

సోమా గని ప్రమాదం జరిగిన రోజునే, అమెరికాలోని పశ్చిమ వర్జీనియా రాష్ట్రంలో గని కప్పు కూలి ఇద్దరు కార్మికులు మృతిచెందారు. ఈ గని, భద్రతా చర్యలు పాటించని రికార్డు కలిగి వుంది. 2010లో ఇదే గనిలో జరిగిన ప్రమాదంలో బొగ్గు నుసి మండటంతో 29 మంది కార్మికులు మరణించారు.

ప్రపంచవ్యాపితంగా గని కప్పులు కూలి, మంటలు చెలరేగి, నీళ్ళతో నిండిపోయి తదితర భూగర్భగనుల ప్రమాదాలలో ప్రతి ఏడాది 1200 మంది గని కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. ఊపిరితిత్తులు చెడిపోయి కృశించి చనిపోయేవారు అసంఖ్యాకంగా వున్నారు. గత ఏడాది చైనాలో ఒక గని ప్రమాదంలో 1049 మంది కార్మికులు మృతిచెందినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

నానాటికీ పెరుగుతున్న ఈ గని ప్రమాదాలు పెట్టుబడిదారీ వ్యవస్థ మానవ హనన స్వభావాన్ని తెలుపుతున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ లాభార్జన ముందు మానవ ప్రాణానికి విలువ లేకుండా చేసిందని మరోసారి నిరూపించింది.

దీనికి సమాధానం ఒక్కటే. కార్మికుల మొక్కవోని వర్గపోరాటం. ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ అయిన సోషలిస్టు వ్యవస్థలో, ప్రభుత్వ ఆధ్వర్యంలో సాగే కార్యకలాపంగా ప్రపంచ గని పరిశ్రమను మార్చేందుకు కార్మికులు పోరాడాలి. ✶

ఝార్ఖండ్ గ్రామ సభల సదస్సు

9-2-14, రాంచి :

ఝార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీలో 2014 ఫిబ్రవరి 9న గ్రామ సభల సదస్సు జరిగింది. రాంచి, గఢ్వ, లాహోర్‌డాగా, ఈస్ట్ సింగ్ భూమ్, గిరిడిఫ్, సరాయ్‌కోలా, కర్సావ, హజారీబాగ్, ఛాత్రా, గుంలా, దుంకా మొదలైన 50కి పైగా గ్రామసభల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. వివిధపార్టీల, ప్రజాసంఘాల, విస్థాపన వ్యతిరేక ఉద్యమ నిర్మాణాల ప్రతినిధులు తగు సంఖ్యలో ఈ సదస్సుకు హాజరయ్యారు. దర్శన్‌గంగు, బీర్సా హేంబ్రామ్, పి.పి. వర్మ, డా॥ సునీతా కుమారి, బాబుధన్, మదనమోహన్ మొదలైనవారు ఈ సదస్సులో పాల్గొన్నారు. సదస్సు ఆవరణంతా విప్లవ గీతాలు, నినాదాలతో ఐక్యత - పోరాట స్ఫూర్తితో నిండిపోయింది.

వక్తలు తమ ఉపన్యాసాల్లో - గ్రామీణ పేదలకు చట్టప్రకారం కల్పించబడిన కొన్ని హక్కులను గురించి వివరించి, ఈ హక్కులను ప్రజలు తమ ప్రయోజనాలకనుగుణంగా మలచు కునేందుకు ఏం చేయాలో - వివరించారు. నీరు, అడవి, భూమి మరియు ఇతర సహజవనరులపై ప్రజల హక్కును చట్టం గుర్తిస్తోందని, ప్రభుత్వాలు, కంపెనీలు గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలను లేదా ఇతర ప్రాజెక్టులను నిర్మించటాన్ని, గ్రామ ప్రజల వనరులను గ్రామసభ ఆమోదం లేకుండా తరలించుకెళ్ళటాన్ని ఇది నిషేధిస్తున్నదన్నారు. ప్రజలు సాధించుకున్న హక్కులను వారి ఐక్య, సంఘటిత ఉద్యమాల ద్వారానే పరిరక్షించుకో గలరని వక్తలు పేర్కొన్నారు.

హజారీబాగ్‌లో కొనసాగుతున్న ఉద్యమ నాయకుడు అనిరుధ్ దాంగి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అమలుచేయాలని కోరుతూ కామాపూర్ ప్రాంతంలో రైతాంగం పోరాటం సాగించి, అక్కడి బొగ్గుపై హక్కును ఏవిధంగా సాధించుకోగలిగారో వివరించారు. ఇక్కడి రైతులు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించటానికైనా సిద్ధమయ్యారుకానీ, తమను తమ గ్రామాల నుండి నిర్వాసితులను చేసి, తమ భూములను కబ్జా చేసేందుకు కంపెనీని అనుమతించేందుకు సిద్ధం కాలేదు.

దీనితోపాటుగా, ఒక ప్రత్యామ్నాయ అభివృద్ధి ప్రయత్నంగా అక్కడ లభ్యమయ్యే బొగ్గు వనరులను ఉపయోగించి రైతులు ప్రస్తుతం విద్యుదుత్పాదన చేస్తున్నారు. అరవింద్ అంజుమ్ మాట్లాడుతూ బడా, బహుళజాతి కంపెనీలను, వాటి దళారీలను గ్రామాల్లోకి ప్రవేశించనీయకుండా అడ్డుకోవటానికి ఇదే సరైన సమయమని సూచించారు. రాజ్యాంగంలో 5వ షెడ్యూలు గిరిజనులకు కొన్ని ప్రత్యేక హక్కులను కల్పిస్తోందని, 1996లో చేసిన ఆదివాసీ హక్కుల చట్టం ఆదివాసుల హక్కులను పునరుద్ఘాటిస్తోందన్నారు. షెడ్యూల్డు ప్రాంతాలలోని ఆదివాసుల హక్కులను పరిరక్షించేందుకు జోక్యం చేసుకోగలిగే విశేషాధికారాన్ని 5వ షెడ్యూలు గవర్నరుకు కల్పిస్తోంది. కాగా, ఇంతవరకూ, ఏనాడూ ఆదివాసుల హక్కులను కాపాడేందుకు గవర్నరు జోక్యం చేసుకున్న దాఖలా లేదు. కనుక, ఆదివాసులు ఐక్యమై, సంఘటిత పోరాటాలు నిర్మించటం మినహా వారికి మరో ప్రత్యామ్నాయం మిగిలిలేదు. ఆదివాసులు తమ హక్కులను అనుభవించేందుకు అనుమతించటానికి ఈ ప్రభుత్వాలు, పాలకవర్గపార్టీలేవీ సిద్ధంగాలేవు. మదన్‌మోహన్ మాట్లాడుతూ, వివిధ ప్రాంతాల్లో గ్రామసభల నాయకత్వాన విలువైన రాయి తరలింపు మాఫియాకు, అటవీసంపద తరలింపు మాఫియాకు, బొగ్గు మాఫియాకు, కంపెనీల, ప్రభుత్వాల అధికారులకు వ్యతిరేకంగా పోరాటాలు జరుగుతున్న విషయాన్ని ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. కానీ ఈ పోరాటాలన్నీ విడివిడిగా, ఒంటరి చేయబడిన విధంగా వుండటంతో అవి బలంగా, ప్రభావశీలంగా ముందుకు సాగలేక పోతున్నాయనీ, తరచుగా ఆ పోరాటాలు వైఫల్యం చెందుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో, ఈ సదస్సు విడివిడిగా సాగుతున్న ఈ ఆందోళనోద్యమాల నన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చి, సమైక్యంగా, నిర్మాణ యుతంగా పోరాటాన్ని సాగించేందుకు ఓ తీర్మానం చేయాలని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి ఈ సన్నాహాలలో భాగంగానే ఈ సదస్సు జరిగింది.

సదస్సును ముగిస్తూ పిపి వర్మ మాట్లాడుతూ గ్రామసభలన్నీ తిరుగుబాటుకు పిలుపు ఇవ్వవలసిన అవసరముందని పేర్కొన్నారు.

ఏ కంపెనీ గానీ, దళారీ గానీ తమ గ్రామాలలోకి ప్రవేశింపనీయబోమని ఈ సదస్సు ప్రకటించింది. గ్రామాల అభివృద్ధి అంతటినీ గ్రామసభల ద్వారానే చేపట్టాలని పేర్కొంది. ప్రాంతీయ గ్రామసభల సదస్సులు, ప్రదర్శనలు నిర్వహించాలని సదస్సు పిలుపునిస్తూ తీర్మానించింది. డా॥ సునీతా కుమారి అభినందనలతో సదస్సు ముగిసింది. ముగింపులో సదస్సు ప్రాంగణమంతా ఉత్సాహభరితమైన, ఉత్తేజకరమైన నినాదాలతో నిండిపోయింది. ✶



లెనిన్ ప్రసిద్ధ రచన

రాజ్యమూ - విప్లవమూ

కుప్తీకరణ : **ఎన్.వి.యస్. నాగభూషణ్**

ప్రచురణ : **టి.ఎన్. మెమోరియల్ ట్రస్ట్**

వెల : రూ. 20/-

ప్రతులకు : **మైత్రీబుక్‌హౌస్**

28-9-1, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 2

సామ్రాజ్యవాద... (మొదటి పేజీ తరువాయి)

ఇది ఒక్క అమెరికాలోనే కాదు; జపాన్‌తో సహ యూరోపియన్ యూనియన్ దేశాల వంటి సంపన్న, అభివృద్ధిచెందిన దేశాలన్నింటిలోనూ ఆకలి, పేదరికం, అసమానతలు, నిరుద్యోగం వేగంగా విస్తరిస్తూ రోజు రోజుకీ అధికమవుతున్నాయి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, యూరప్ సెంట్రల్‌బ్యాంకులు రూపొందించిన 'పొదుపు చర్యల' పేరిట ప్రభుత్వాలు అమలుచేస్తున్న విధానాలు; విద్య, వైద్యరంగాల ప్రైవేటీకరణ విధానాలు యూరప్ దేశాలన్నింటిలో ప్రజల దుర్భర పరిస్థితులను తీవ్రం చేస్తున్నాయి. కార్మికుల వేతనాలు మరింతగా దిగజారిపోతూ ఆయా దేశాలలో ప్రజలు ఆకలి బాధలబారిన పడుతున్నారు. ప్రతి సంవత్సరం యూరోపియన్ యూనియన్ సభ్య దేశాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్య, వైద్య, సాంఘిక సంక్షేమరంగాల్లో అసాధారణ కోతల విధానాల ఫలితంగా 2.5 కోట్ల మంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో కూరుకుపోయారు. గ్రీస్, ఐర్లాండ్, ఇటలీ, పోర్చుగల్, స్పెయిన్, బ్రిటన్‌లలో ప్రపంచంలోనే అత్యధికంగా అసమానతలు పెరిగి పోతున్నాయి. యూరోప్ దేశాలలో ప్రజల జీవనస్థితి గతులు గణనీయంగా దిగజారి పోతున్నాయి. షుమారు 8.8 లక్షల ప్రజానీకం ఆధునిక బానిసలుగా ఈ దేశాలలో నికృష్ట శ్రమదోపిడీకి గురిచేయబడుతున్నారు.

విభజించి పాలించే విధానాలు

అనేక కార్పొరేటు సంస్థలు, సాంకేతిక కార్మికులుగా పిలవబడేవారి సంఖ్యను ప్రధానంగా పెంచుతూ అదే సమయంలో పారిశ్రామిక నైపుణ్య కార్మికులను (బ్లూ కాలర్ కార్మికులను) పెద్దసంఖ్యలో తగ్గించివేస్తూ మరోవైపున ఈ దొంతరల నడుమ ఒక విభజనను సృష్టిస్తోంది. వాస్తవానికి ఈ సాంకేతిక కార్మికులతో కూడా వారేమీ సక్రమంగా వ్యవహ రించటంలేదు. పారిశ్రామిక కార్మికులు ఏవిధంగానైతే కారుచౌక శ్రమ దోపిడీకి గురౌతున్నారో, అదేవిధంగా ఈ సాంకేతిక కార్మికులు (ఐ.టి. వృత్తిదారులు) కూడా వారి వేతనాలలో దిగకోత పథకాలతో దోపిడీకి గురిచేయబడుతున్నారు. ఆపిల్, గూగుల్, ఇన్‌టెల్, అడోబ్, ఇన్‌టూట్, పిక్సర్, లూకాస్ ఫిల్మ్ వంటి అమెరికా బడా ఐటి కార్పొరేషన్ సంస్థలు - వారిలో వారు పోటీలను నివారించుకుంటూ, వీరి కంపెనీల నుండి బయటకొచ్చిన వారిని వీరిలో మరెవరూ తిరిగి చేర్చుకోకుండా ఒప్పందాలు చేసుకుంటూ 'అంతులేని కుట్ర'కు పాల్పడుతున్నాయి. ఫలితంగా కృత్రిమంగా తక్కువ వేతనాలతో, సాపేక్షంగా మెరుగైన అవకాశం కోసం ప్రయత్నించటానికి సాధ్యంగాకుండా కట్టడి చేస్తున్నాయి. యూనియన్లలో సభ్యులుకాని 64,600 మంది సాంకేతిక కార్మికులు 90 లక్షల డాలర్ల పరిహారాన్ని చెల్లించాలని కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయించటం దీనినే వెల్లడిచేస్తోంది. "స్వేచ్ఛా విపణి" గురించిన ప్రబోధకులు వారి పరిశ్రమల్లో సాంకేతిక కార్మికుల వేతనాలను బ్లూ కాలర్ కార్మికుల వేతనాలవలెనే కోత విధిస్తూ ఆచరణలో ఏవిధంగా వ్యవహరిస్తున్నారో ఇది తెలియచేస్తున్నది. 'కార్పొరేటు సంస్కృతి', 'స్వేచ్ఛా విపణి' వంటి పెట్టుబడిదారీ విధాన నయవంచక విధానాలను ఇది వెల్లడిచేస్తోంది.

సాంకేతిక కార్మికులను - పారిశ్రామిక నైపుణ్య కార్మికులను వేతనాల, సౌకర్యాల, సదుపాయాల నడుమ తీవ్ర అంతరాలతో విభజించే విధానాలను, కార్పొరేటు సంస్థలు అమలుచేస్తున్నాయి. వీరు సృష్టించిన ఈ వైషమ్యాల ఫలితంగా అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో, ఓక్‌లాండ్‌లలో గూగుల్, యాపిల్ కార్పొరేషన్‌లో పనిచేసే సాంకేతిక కార్మికులకు వ్యతిరేకంగా బ్లూ కాలర్ కార్మికులు బహిరంగంగా నిరసన రూపాలతో ముందుకొచ్చారు. అధిక వేతనాలు పొందే సాంకేతిక కార్మికుల కారణంగా బ్లూ కాలర్ కార్మికుల నివాస ప్రాంతాలలో ఇళ్ళ అద్దెలు అసాధారణంగా పెరిగిపోయాయని, వారికి అద్దె ఇల్లు దొరకటమే గగనమైపోయిందని పేర్కొంటూ సాంకేతిక కార్మికులకు వ్యతిరేకంగా వారు వీధుల్లోకి వచ్చారు. ఆ కార్పొరేషన్ల సిబ్బందిని, సాంకేతిక కార్మికులను పరిశ్రమకు చేరవేసే బస్సులను కదలనీయకుండా బ్లూ కాలర్ కార్మికులు అడ్డుకున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో గానీ మరే ప్రాంతంలో అయినాగానీ పారిశ్రామిక కార్మికుల ఆగ్రహం న్యాయమైనదే అయినప్పటికీ, ఈ ఆగ్రహం వాస్తవంగా కార్మికుల మధ్య ఈ విభజనను - అంతరాలను సృష్టించిన కార్పొరేటు సంస్థల యాజమాన్యాలకు, పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడాలిగాని, సాంకేతిక కార్మికులకు వ్యతిరేకంగా కాదు.

నిరుద్యోగ పరిస్థితికారణంగా స్థానిక కార్మికులకు - ఇతర దేశాల, ప్రాంతాల నుండి వచ్చిన వలస కార్మికులకు నడుమ శత్రుత్వం, ద్వేషభావం పెంపొందించబడుతున్నది. ఫలితంగా ఇది తరచూ వలస కార్మికులపై దాడులకు, కొన్ని సెక్షన్ల కార్మికులలో ఫాసిస్టు ధోరణులు పెరిగిపోవటానికి కారణమవుతోంది. ఈ పరిణామాలన్నీ హానికరమైనవి.

జపాన్‌కు చెందిన టయోటా కార్ల పరిశ్రమలో ఉత్పత్తి నాణ్యత అభివృద్ధిచేసేందుకు ఉత్పత్తి విధానంలో ఇటీవల తీసుకొన్న మార్పు-యాంత్రీకరణ, సాంకేతిక అభివృద్ధి యొక్క పరిమితులను, మానవ శ్రమ నైపుణ్యాల ఆధిపత్యాన్ని తెలియచేస్తున్నది. టయోటా హోన్షు పరిశ్రమలో, మొత్తం లోహం నుండి క్రాంక్ - షాఫ్ట్ తయారీ పనిని రోబోల నుండి కార్మికులకు అప్పగించాలని యాజమాన్యం నిర్ణయించింది. యాంత్రికమైన రోబో పని పద్ధతుల్లో గాకుండా, కార్మికులు క్రాంక్ - షాఫ్ట్‌లను మెలిదిప్పటం, ప్రక్కకు తిప్పి సుత్తితో కొట్టడం చేయగలుగుతారు. 3 సం॥ల క్రితం మానవ శ్రమ ద్వారా పొందిన అనుభవం ఫలితంగా తుక్కును తగ్గించివేసే, 96 శాతం పొదుపు పొట్టిగా చేసే నూతన ఆవిష్కరణలు చేయగలిగారు. యాగ్జిల్ బీమ్స్ ఉత్పత్తిని పెంపుచేయటానికి, ఉత్పత్తి ఖర్చు తగ్గించటానికి, రోబోల కంటే కార్మికుల ద్వారా పనిచేయించటమే ఉత్తమమైనదిగా యాజమాన్యం గుర్తించింది.

ఇప్పటిదాకా ఆ కంపెనీకి చెందిన అన్ని ప్లాంట్లలోనూ యంత్రాలలోకి సంబంధిత భాగాలను కూర్చటం, ఆ పని విఫలమైతే సహాయం కోసం మరొకరిపై ఆధారపడటంగా వుంది. కానీ ఈ యంత్రాల (రోబోల) స్థానంలో కార్మికులు వుంటే ఆ ఉత్పత్తి నాణ్యత, సమర్థత పెరుగుతుందనేది టయోటా యాజమాన్య అనుభవం తెలియజేస్తోంది. కనుక, మానవశ్రమశక్తికంటే సాంకేతిక సామర్థ్యాన్ని గురించి, దాని ఆధిపత్యాన్ని గురించి పెట్టుబడిదారీ విధానం పెద్దఎత్తున చేస్తోన్న ప్రచారమంతా బూటకమైనదేనని స్పష్టమవుతోంది.

పీడన, అణచివేతలు

ఒకవైపున కార్మికులు ఉత్పత్తిచేసిన సంపదంతా పెరిగిపోతూ, బహుళజాతి కార్పొరేషన్ల లాభాలు భారీస్థాయిలో పోగుపడుతున్నాయి. మరో వైపున కార్మికుల పనిపరిస్థితులు, జీవన స్థితిగతులు ఘోరంగా దిగజారిపోతున్నాయి. కార్మికుల హక్కులన్నీ నిరాకరించ బడుతున్నాయి. పెట్టుబడిదారీవ్యవస్థ తన ఆర్థిక సంక్షోభాన్ని కూడా సౌకర్యవంతంగా తన దోపిడీ ప్రయోజనాల పెంపుకోసం, తన సూపర్ లాభార్జనల పెంపు కోసం కార్మికులను మరింతగా దోచుకునేందుకు సమన్వయంతో ఉపయోగించుకుంటోంది. దీనితో ప్రపంచ వ్యాపితంగా కార్మికుల జీవన పరిస్థితులు దుర్భరంగా తయారయ్యాయి.

బంగ్లాదేశ్ రెడీమేడ్ దుస్తుల పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదాలలో వందలాదిమంది దుస్తుల కార్మికులు దుర్మరణాల పాలుగావటం; పని ప్రదేశాల్లో ప్రమాదాల పేరిట పెద్ద సంఖ్యలో కార్మికులు అనునిత్యం ప్రాణాలు కోల్పోవటం కార్మికుల భద్రత విషయంలో 'గుత్త పెట్టుబడి' యొక్క ఘోర నేరపూరిత నిర్లక్ష్యాన్ని తెలియ జేస్తోంది. (టర్కీ గనులలో వందలాది కార్మికుల సజీవ సమాధి దీనికి తాజా ఉదాహరణ - విశ్లేషణ **3వ పేజిలో చూడండి.**) టర్కీలో కార్మికులపై ప్రభుత్వ, పోలీసుల నిర్బంధం, హింసాకాండ పెరుగుతున్నాయి. కోస్టారికాలో ప్రభుత్వం, ప్రభుత్వరంగంలో కార్మికుల సమ్మెలను నిషేధించింది. పనామాలో పనామా కెనాల్ కార్మికుల సమ్మెలను ప్రభుత్వం నిషేధించింది. గల్ఫ్ దేశాలలోనూ, కజకస్థాన్, గ్వాటిమాలలలో కార్మికులు యూనియన్లను ఏర్పాటుచేసుకునే హక్కు కూడా లేదు. కొలంబియాలో గనుల కార్మికులు, లోహపరిశ్రమ కార్మికులు అనునిత్యం దాడులకు గురవుతున్నారు. చైనాలో కార్మికులహక్కులన్నీ నిష్కర్షగా నిరాకరిస్తున్నారు. బంగ్లాదేశ్, శ్రీలంక, కంబోడియా, భారతదేశం, వియత్నాం, చైనా మొదలైన దేశాలలో రెడీమేడ్ దుస్తుల పరిశ్రమ కార్మికులస్థితి వర్ణనాతీతంగా, దయనీయంగా వుంది. దాదాపు ప్రపంచంలోని అన్ని దేశాలలో ప్రభుత్వాలు, న్యాయమైన తమ డిమాండ్ల సాధనకోసం కార్మికులు సాగించే ఆందోళనలు, సమ్మెలపై సైనిక బలగాలను, రక్షణ బలగాలను, పోలీసులను ప్రయోగిస్తున్నాయి.

ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి పెద్ద గొంతుతో మాట్లాడే అమెరికా; స్వాతంత్ర్యం ప్రజాస్వామ్య హక్కులకు తనను తాను ఛాంపియన్‌గా ప్రకటించుకునే అమెరికా - తన దేశంలో ప్రతిఏటా ఏప్రిల్ 26న బ్రూక్లిన్ వద్ద కార్మికులు జరుపుకునే భారీ మేడే కార్యక్రమాల సందర్భంగా గత రెండు సంవత్సరాల కాలంగా వాహనాలపై మైకులను ఉపయోగించేందుకు న్యూయార్క్ నగర మునిసిపల్ అధికారులు అనుమతి నిరాకరిస్తూ వస్తున్నారు. అదే సందర్భంలో, తినుబండారాలు, ఐస్‌క్రీములు అమ్ముకునే వ్యాపారులను మాత్రం ఎలాంటి ఆంక్షలు లేకుండా మైకులను ఉపయోగించు కోవటానికి అధికారులు అనుమతించారు. ఈ విధమైన శత్రుపూరిత, సంకుచిత చేష్టలద్వారా కార్మికుల వర్గ ఆకాంక్షల గొంతు నులిమేయాలనుకునే పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క నీచ ఉద్దేశ్యాలతోబాటుగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యం, మానవహక్కుల గురించి గొంతు చించుకునే అమెరికా నయవంచన మరోసారి తేటతెల్లమైంది.

భారతదేశంలో నిరుద్యోగం పెరుగుదల

ప్రపంచంలోని ఇతర దేశాల కార్మికుల పరిస్థితుల కంటే మనదేశ కార్మికుల పరిస్థితులు ఏవిధంగానూ మెరుగ్గా లేవు. కాగా, వాస్తవానికి మనదేశ కార్మికుల పరిస్థితులు పైన పేర్కొన్న ఇతర దేశాల కార్మికులకంటే ఘోరంగా వున్నాయి.

2014 ఏప్రిల్ 10నాటి ప్రపంచబ్యాంకు నివేదిక ప్రకారం, ప్రపంచంలోని అత్యంత నిరుపేదలలో మూడవవంతు ప్రజలు మనదేశంలోనే వున్నారు. ప్రపంచంలోని దారిద్ర్య దేశాలలో మనదేశం అగ్రస్థానంలో వుంది. ప్రపంచ ఆకలి సూచీలోని 79 దేశాలలో మన దేశం 65వ దేశంగా వుండటమేగాక, గత 12 సం॥లుగా ఇదే దొంతరలో కొనసాగుతోంది. అవమానకర విషయమేమంటే, రువాండాలాంటి దేశం కూడా భారత దేశంకంటే మెరుగైన స్థితిలో వుంది. మనదేశ స్థూలజాతీయ ఆదాయం, తలసరి ఆదాయాలు రెట్టింపయ్యాయని పాలకులు ఊదరగొడ్తోన్న ఈ కాలంలోదే ఈ పరిస్థితి. 2014 ఫిబ్రవరిలో మెక్ కిన్‌సే గ్లోబల్ సంస్థ వెలువరించిన తన పరిశోధనా పత్రంలో మనదేశంలోని 56 శాతం జనాభా లేదా 68 కోట్లమంది ప్రజానీకం ఆహారం, వైద్యం, విద్య, పారిశుధ్యం, త్రాగునీరు, ఇల్లు, ఇంధనం, సామాజిక భద్రతలనే తమ కనీస అవసరాలు కూడా పొందలేకపోతున్నారని పేర్కొంది. ప్రపంచ కార్మికసంస్థ అందజేసిన వివరాల ప్రకారం - భారతదేశంలో నిరుద్యోగం వృద్ధిచెందే దిశలోనే సాగుతోంది; 'ఉద్యోగరహిత అభివృద్ధి'ని భారతదేశం ఎదుర్కొంటుందని పేర్కొంది.

క్రిసిల్ (సిఆర్ఐఎస్ఐఎల్) నివేదిక ప్రకారం- రానున్న కాలంలో ఉద్యోగ కల్పన తగ్గిపోనున్నదనే అంచనాతో 1 కోటీ 20 లక్షలమంది తక్కువ నాణ్యత, కొద్ది ఉత్పాదకత ఉన్న గ్రామీణ లేదా వ్యవసాయ ఉపాధులలోకి ఏడు సంవత్సరాలుగా బలవంతంగా నెట్టబడుతున్నారు. భారతదేశ ప్రధాన కార్మిక శక్తిగావున్న పేదశ్రామిక ప్రజానీకం ఏరోజుకారోజు తిండి గడవటానికి చూసుకొనే వారేతప్ప, పేదరికాన్ని అధిగమించేంత సంపాదన వారికి లేదు. వాణిజ్యవ్యవస్థ అసంఘటిత విభాగాల జాతీయ కమీషన్ (ఎన్‌సిఇయుఎస్) ప్రకారం - భారతదేశ మొత్తం కార్మికులలో 86 శాతం ఇన్‌ఫార్మల్ విభాగంలో పనిచేస్తున్నారు. ఫార్మల్ విభాగంలో ఉద్యోగిత కూడా కుంచించుకుపోతోంది. 1991 నాటి సరళీకరణ నాటినుండి అత్యధికభాగం నికర ఉద్యోగ కల్పనంతా ఇన్‌ఫార్మల్ విభాగంలో వుంది. అంటే అశేష శ్రామికులకు కనీస వేతనం, భద్రతతో కూడిన పని పరిస్థితులు, మౌలిక వసతి, ఆరోగ్య సౌకర్యాల వంటివేవీ వుండవన్నమాట. 'క్రెడిట్ సూయిస్సి' ఇటీవలికాలపు అధ్యయనంలో మనదేశంలోని 90 శాతం కార్మికులు అసంఘటితరంగంలో వుంటూనే, భారతదేశ జిడిపిలో సగభాగాన్ని ఉత్పత్తి చేస్తున్నారని తెలిపింది.

హక్కులపై దాడి

సంఘటితరంగ కార్మికుల పరిస్థితులు కూడా ఏమీ మెరుగ్గా లేవు. యాజమాన్యాలు, ప్రభుత్వాలు వీరి హక్కులు, సదుపాయాలపై నిరంతరాయ దాడిని సాగిస్తున్నాయి. పనిభారం పెంపు, పనిగంటల పెంపు, ఉద్యోగ విరమణానంతర పెన్షను, వైద్యసౌకర్యం వంటి సదుపాయాలలో కోతవంటి పలురూపాల్లో ఈ దాడులు చేస్తున్నాయి. కార్మికుల సమ్మెహక్కును గుర్తించటానికి నిరాకరిస్తున్నాయి. 'పనిగంటల స్థిరీకరణ, గనుల చట్టంలో పనిగంటలను నియంత్రించే సెక్షను - 83' సవరణలపేరిట అన్ని విభాగాలలోని కార్మికుల పనిదినం పద్ధతిలో మార్పుచేయటానికి రంగం సిద్ధం చేశాయి. ప్రస్తుతం ఓఎన్‌జిసిలో కార్మికులు, పనిప్రదేశంలో 14 రోజులు నిరంతరాయంగా పనిచేసి ఆ తర్వాత 14 రోజులు శలవు తీసుకోవాలి. ఇప్పుడు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు చమురు కంపెనీలూ ఈ పద్ధతిని మార్చివేసి, కార్మికులను 28 రోజులపాటు పని ప్రదేశంలో వుంచటానికి, ఆ తర్వాత 28రోజులు శలవుఇవ్వటానికి అనుగుణంగా మార్పులు చేయాలని భావిస్తున్నాయి. ఈ పరిస్థితి, అధికకాలంపాటు కార్మికులను వారి కుటుంబాల నుండి దూరం చేస్తుంది. అత్యవసర సమయాల్లోనూ వారు అందుకోలేని స్థితికి దోవ తీస్తుంది. అదేవిధంగా దుస్తుల తయారీ పరిశ్రమలో మహిళా కార్మికులను రాత్రిపూట పనిచేయించేందుకు, దేశం నుండి ఎగుమతులను పెంపుచేసేందుకు కార్మిక చట్టాలను అనువుగా మలిచేందుకు రంగం సిద్ధం చేశాయి. ఐటి కంపెనీల సాంకేతిక కార్మికులను కూడా మినహాయించబోవటం లేదు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఇండస్ట్రియల్ ఎంప్లాయిమెంట్ (స్టాండింగ్ ఆర్డర్స్) చట్టం - 1946 వర్తించకుండా 17 పారిశ్రామిక రంగాలకు ఐదు సంవత్సరాలపాటు మినహాయింపు నిచ్చింది.

ఐటి విభాగ యజమానులు కార్మికుల చట్టాల అమలులో అనేక అక్రమాలకు పాల్పడేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ఐటి ఉద్యోగుల వేతనాలు, కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య, సగటు పనిగంటలు వంటి అంశాలను నిర్ధారించటాన్నుండి ఐటి కంపెనీలను ఇది మినహాయిస్తుంది. ఇప్పటికే బెంగుళూరులోని ఐటి పరిశ్రమలు, మహిళా ఉద్యోగులకు తరచూ తక్కువ వేతనాలు చెల్లిస్తున్నాయి. తమ ఇళ్ళ వద్ద నుండి వచ్చి విధులు నిర్వర్తించే మహిళలచేత అధిక గంటల పనిచేయిస్తున్నాయి.

వెట్టిచాకిరి

మానవ మలమూత్రాలను మనుషుల ద్వారా శుభ్రం చేయించే వృత్తిని నిషేధిస్తూ 1993లో ప్రభుత్వం చేసిన చట్టం; పాకీ పనికి వ్యతిరేకంగా పలు సందర్భాలలో సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికలు వంటి వాటినన్నీ పెడచెవిన పెట్టి పాకీ వృత్తిని కొనసాగించటం, అది కూడా భారత రైల్వేల వంటి ప్రభుత్వరంగ సంస్థలలో కొనసాగించటం దేశానికే సిగ్గుచేటు. నగరపాలకసంస్థల భూగర్భ మురుగు కాల్వల పారిశు ధ్య పనిలో దేశంలోని ప్రతి నగరంలో, పట్టణంలో కార్మికులు మరణించటం నిత్యకృత్యమైంది. 3 లక్షల 50 వేలమంది దళితులు, ఇందులో 98 శాతం మహిళలు ఈ పాకీ వృత్తిలో వున్నారనేది అంచనా.

దేశవ్యాపితంగా వెట్టిచాకిరీ విధానం అమలవు తోంది. గాంధీ పీస్ ఫౌండేషన్, నేషనల్ లేబర్ ఇన్‌స్టిట్యూట్‌ల సర్వే ప్రకారం 1976 నాటికి 10 రాష్ట్రాలలో 26 లక్షలమంది శ్రామికులు వెట్టిచాకిరీలో వున్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించే వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభంతో ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. చట్టభీతి లేకుండా ఒకే తరహా పనిచేసే స్త్రీ, పురుషుల వేతనాలలో వ్యత్యాసాలు, మహిళా కార్మికులపట్ల వివక్ష కొనసాగుతున్నాయి. అసంఘటితరంగ పనులలోనూ, ఇన్ ఫార్మల్ రంగంలోని ఉత్పత్తి కార్యకలాపాలలోనూ పెద్ద సంఖ్యలో కార్మికులచే పనిచేయిస్తూ బాలకార్మిక వ్యవస్థను కొనసాగిస్తున్నారు.

పరిశ్రమలలో కార్మికుల పని పరిస్థితులు చాలా అసౌకర్యంగా వుంటున్నాయి. లాభార్జనే కేంద్రంగా

(తరువాయి 5వ పేజీలో)

సుజుకీ కార్ల కంపెనీ
దోపిడీని తీవ్రపరిచే సరికొత్త పద్ధతులు

బహుళజాతి కంపెనీలు వెనకబడిన దేశాలలో సాగిస్తున్న దోపిడీ పద్ధతులు ఈస్టు ఇండియా కంపెనీ నాటి దారి దోపిడీ పద్ధతులను తలపిస్తున్నాయి. ఇవి సాగిస్తున్న నిలువు దోపిడీ గురించి తరచుగా వార్తలలో వస్తున్నాయి. అలా తాజాగా బయటపడ్డదే సుజుకీ కార్ల కంపెనీ ఉదంతం.

ఇందిరాగాంధీ కాలంలో ఆమె తనయుడు సంజయ్‌గాంధీ మారుతీ కార్ల కంపెనీని ప్రారంభించాడు. మధ్యతరగతికి అందుబాటు ధరలో చిన్నకారు తయారీ లక్ష్యంగా ప్రకటించు కున్నాడు. చిన్నకారు తయారీకి ఎలాంటి ఏర్పాటూ జరగకముందే, దేశంలోని బడాబూర్జువాలూ, బడావాణిజ్యం ఈ కంపెనీల్లో వాటాలుగా పెట్టుబడి పెట్టారు. సంజయ్‌గాంధీ మరణంతోనూ, కాంగ్రెస్ ఓటమితోనూ, మారుతీ కంపెనీ మూలనపడింది. జనతా పార్టీ పాలన కాలంలో దీనిపై అనేక అవినీతి ఆరోపణలొచ్చాయి. 1980లో తిరిగి ఇందిరాగాంధీ ప్రధాని కావటంతో మారుతీ కంపెనీని ప్రభుత్వరంగ సంస్థగా చేశారు. చివరకు సుజుకీ కంపెనీతో ఒప్పందం చేసుకొని మారుతీ కార్ల తయారీ ప్రారంభించారు. జపాను నుండి దిగుమతైన విడిభాగాలను కూర్పు చేయటమే జరిగింది. నూతన ఆర్థిక విధానాలలో భాగంగా కార్ల రంగాన్ని విదేశీ కంపెనీలకు బార్లా తెరవటంతో సుజుకీ కంపెనీ, మారుతీలో వాటాలు పొందింది. మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ కంపెనీగా రూపొందింది. ఒక క్రమంలో ప్రభుత్వ వాటాను తగ్గించుకుని కంపెనీని సుజుకీ వరంచేసింది. ప్రపంచంలో పెద్ద కార్ల కంపెనీలన్నీ భారత్‌లో అడుగుపెట్టాయి. భారతదేశ వనరులనూ, శ్రమశక్తినీ చౌకగా కొల్లగొట్టి లాభాలు పొందేందుకై యూరపులోనూ అమెరికాలోనూ తమ కార్ల కంపెనీలను మూసివేసి, భారత్, చైనా, బ్రెజిల్ తదితర దేశాలలో పెట్టాయి. ఈ క్రమంలో మారుతీ కంపెనీ భారత్‌లో అతిపెద్ద కార్ల తయారీదారుగా వుంది.

మారుతీ సుజుకీ కంపెనీ కార్ల తయారీలోనే కాకుండా వాటికి విడిభాగాల తయారీ, అనుబంధ పరిశ్రమల్లో కూడా పెట్టుబడి పెట్టింది. కార్మికులను బానిసలుగా చూస్తూ, బూటుకాళ్లతో వారిని తన్నే దుర్మార్గపు పద్ధతులను ఇది పాటించింది. దీనితో కార్మికులు తమ హక్కుల కొరకు సమ్మె చేయగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలూ, నేతలూ, అధికార గణమూ యాజమాన్యం పక్షాన చేరి కార్మికులను అణచివేతకు గురిచేశాయి. సుజుకీ కంపెనీ ప్రతినిధులపై ఈగ వాలనివ్వకుండా కుక్క కాపలా కాశాయి.

భారత కార్మికుల శ్రమనూ, ఇక్కడి ఆర్థిక వనరులనూ సుజుకీ కంపెనీ ఎంతగా దోచుకుందో చూడండి. జపానుకు చెందిన సుజుకి మోటార్ కార్పోరేషన్, భారత్‌తప్ప మిగిలిన అన్నిదేశాలలోనూ తన కార్ల అమ్మకాల ద్వారా పొందిన లాభాలు రూ॥ 2402 కోట్లు (2012-13). ఇది దాని అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయంలో 2.6 శాతం. కాగా మారుతీ సుజుకీ కంపెనీ అదే ఏడాది రూ.2453 కోట్లను రాయల్టీగా చెల్లించింది. ఇది మారుతీ సుజుకీ కంపెనీ అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయంలో 5.1 శాతం అంటే సుజుకీ కంపెనీ కొచ్చిన లాభాల కంటే మారుతీ సుజుకీ కంపెనీ దానికి చెల్లించిన రాయల్టీలు 102 శాతం ఎక్కువ. సుజుకీ కార్పోరేషన్ అమ్మకాల్లో 2.6 శాతం మాత్రమే లాభాలుగా మిగలగా మారుతీ సుజుకీ కంపెనీ తన అమ్మకాల్లో 5.1 శాతాన్ని రాయల్టీగా చెల్లించింది. మారుతీ సుజుకీ కంపెనీకి పన్నులన్నీ చెల్లించిన తర్వాత మిగిలిన లాభంలో దాదాపు 92 శాతంపైగా రాయల్టీగా చెల్లించింది.

ఇది ఒకసారి అరుదుగా జరిగింది కాదు. రూపాయి మారకం విలువ పడిపోయినందున రాయల్టీల చెల్లింపు పెరిగిందనటం సరికాదు. 2009 ఆర్థిక సంవత్సరంలో పన్నులు చెల్లించిన తర్వాత లాభాలు రూ॥ 1218 కోట్లు కాగా రాయల్టీగా చెల్లించింది రూ.6.77 కోట్లు; 2010లో లాభాలు రూ॥ 24977 కోట్లు - రాయల్టీలు రూ. 1,016 కోట్లు. 2011లో లాభం రూ. 2288 కోట్లు కాగా రాయల్టీ చెల్లింపు రూ. 1892 కోట్లు అదే 2012లో లాభాలు రూ. 1632 కోట్లు కాగా రాయల్టీల చెల్లింపు రూ. 1803 కోట్లు. రాయల్టీల చెల్లింపులు మొత్తం అమ్మకాల ఆదాయంలో ఒక శాతం వుండాలన్న నిబంధనను సడలించి 5 శాతం వరకూ అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఫలితంగా రాయల్టీల చెల్లింపులు పెరిగాయన్నది స్పష్టం.

అయినా సుజుకీ కంపెనీ లాభదాహం తీరలేదు. కంపెనీల చట్టం, సెబి చట్టం వంటి చట్టాలన్నింటినీ తుంగలో తొక్కి మారుతీ సుజుకీ కంపెనీ లాభాలను తరలించుకుపోయేందుకు పూనుకుంది. సుజుకీ ప్రయత్నాలను పాలకులు చూస్తూ పూరుకోగా, దేశీయ మదుపుదారులు తీవ్రంగా వ్యతిరేకించటంతో మొత్తం వ్యవహారం బయటకొచ్చింది.

హర్యానాలోని మారుతీ కార్ల ఫ్యాక్టరీలో దోపిడీ అణచివేతలను కార్మికులు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. ఉద్యోగ భద్రత, పనిస్థలాల్లో భద్రత, న్యాయమైన వేతనం, యూనియను పెట్టుకొనే హక్కుకోసం వారు సమ్మెబాటను పట్టారు. కేంద్ర, రాష్ట్ర పాలకులూ, ప్రభుత్వ యంత్రాంగం యాజమాన్యంతో చేతులు కలిపినా, తీవ్ర అణచివేతను సాగించినా, కార్మికుల పోరాటం ఆగిపోలేదు. దీనితో మారుతీ సుజుకీ కంపెనీ కార్ల తయారీని గుజరాత్‌కు మార్చడానికి పూనుకుంది. మతోన్మాద హింసతో పారిశ్రామిక "శాంతి"ని నెలకొల్పిన నరేంద్రమోడీ ఈ కంపెనీకి 8000 ఎకరాలు ధారాదత్తం చేశాడు. 16 గ్రామాల రైతాంగంనుండి ఈ భూమిని మోడీ గుంజుకున్నాడు.

ఈ దశలో సుజుకీ కంపెనీ తన అసలు ఉద్దేశ్యాన్ని బయటపెట్టింది. ఫ్యాక్టరీ పెట్టడానికి మారుతీకి కేటాయించిన భూమిలో తన స్వంత అనుబంధ కంపెనీతో ఫ్యాక్టరీని పెడుతుంది. ఇక్కడ తయారైన కార్లను మారుతీ కంపెనీ ద్వారా అమ్మిస్తుంది. దీనర్థం స్పష్టమే. సుజుకీ కంపెనీ స్వంత అనుబంధ సంస్థ కార్లను తయారుచేయగా, ఇన్నాళ్లూ కార్లు తయారుచేస్తున్న మారుతీ వాటిని అమ్మిపెట్టే వ్యాపారి అవుతుంది. ఒక క్రమంలో మానేసార్ ప్లాంటును మూసివేసి కార్మికులను వీధుల పాలు చేస్తారు. లాభాలన్నీ సుజుకీ కంపెనీ జపానుకు తరలిస్తుంది. గుజరాత్ ఫ్యాక్టరీ కోసం సుజుకీ కంపెనీ పెట్టబోయే పెట్టుబడి రూ॥ 3050 కోట్లు మాత్రమే. భారత్ నుండి తరలించుకుపోయిన ఒక ఏడాది రాయల్టీనే తిరిగి పెట్టుబడిగా పెడుతుంది.

మారుతీ సుజుకీ కంపెనీలో సుజుకీ వాటా 56.21 శాతం. విదేశీ సంస్థాగత మదుపుదారులు (ఎఫ్ఐఐ) వాటా 21.47 శాతం. దేశీయ సంస్థాగత మదుపుదారుల వాటా 13.98 శాతం. చిన్న మదుపుదారుల వాటా 8.34 శాతం దేశీయ సంస్థాగత మదుపుదారుల సొమ్ము రూ॥ 2400 కోట్ల వరకూ మారుతీ సుజుకీ కంపెనీలో వుంది. దీనిలో పెద్ద వాటా సగం దాకా జీవిత భీమా సంస్థది (6.5 శాతం) మిగిలినది రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్, బిర్లా సన్‌లైఫ్, హెచ్‌డిఎఫ్‌సి, స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ వంటి 17 సంస్థలు కలిగి వున్నాయి. ఎల్ఐసి తప్ప, మిగిలిన కంపెనీలన్నీ విదేశీ బీమా కంపెనీలతో ఏర్పడిన మిలాఖత్ కంపెనీలే. కార్మికులను అణచివేయటానికీ, వారిని వీధుల్లోకి నెట్టడానికి గుజరాత్‌లో మరో ఫ్యాక్టరీని పెట్టడానికి ఇవన్నీ అంగీకరించాయి. తమకు లాభాలు రాకుండా సుజుకీ కంపెనీ తరలించుకుపోయే ప్రమాదం కనపడగానే ఇవి గగ్గోలు చేస్తున్నాయి. 'ప్రభుత్వ జోక్యం ఉండరాదు. ప్రైవేట్ మార్కెట్టు శక్తులకు స్వేచ్ఛనివ్వాల'ని వాదించే వీరందరికీ ఇప్పుడు ప్రభుత్వ జోక్యం అవసరమైంది.

దీనితో సుజుకీ కంపెనీ మారుతీలోని సంస్థాగత మదుపుదారుల అనుమతి కోసం సమావేశం నిర్వహిస్తానని ప్రకటించింది. మైనారిటీ వాటాదారుల్లో 75 శాతం అంగీకరిస్తేనే ఈ ఒప్పందంతో ముందుకు వెళ్తానని ప్రకటించింది. అదే సమయంలో చట్ట ప్రకారం తానిలా చేయాల్సిన అవసరంలేదనీ, కార్పోరేటు పాలనల సూత్రాలను బట్టి తానీపని చేస్తున్నానని స్పష్టం చేసింది. ఒకవేళ కాంట్రాక్టు ఉత్పత్తి ఒప్పందాన్ని కొనసాగించరాదని మారుతీ కోరుకుంటే, గుజరాత్ ఫ్యాక్టరీని బుక్కు విలువకే మారుతీకి అమ్ముతానని చెప్పింది. దీనితో వారిమధ్య వివాదం సద్దుమణిగినట్లు కన్పిస్తున్నది. తమకిష్టం లేకపోతే మైనారిటీ వాటాదారులు తమ వాటాను అమ్ముకొని బయటపడాలి లేదా సుజుకీ కంపెనీ నిర్ణయాన్ని ఆమోదించాలి. మైనారిటీ వాటాదారుల్లో ప్రధానభాగం ప్రభుత్వరంగ సంస్థలదే. కనుక నిర్ణయం ప్రభుత్వానిదే. అది సుజుకీకి అనుకూలంగానే ఉంటుంది.

1. చివరికిది ఏ రూపం తీసుకున్నా అసలు సమస్యలు వీరికి పట్టలేదు. రాయల్టీలను పెంచటం ద్వారా సుజుకీ కంపెనీ, మారుతీ కంపెనీ నికర లాభాలను తగ్గించి వేస్తుంది. దీనివల్ల చిన్న మదుపుదారులకు రావాల్సిన ఆదాయం తగ్గిపోతుంది. రాయల్టీలను పెంచే విధంగా, విదేశీ కంపెనీలకు లాభాలూ పెంచే విధంగానే ప్రభుత్వ విధానాలున్నాయి. ప్రజా సంక్షేమానికి వినియోగించవలసిన ఎల్ఐసి వంటి ప్రజల మదుపు సొమ్మును కూడా విదేశీ కంపెనీల లాభార్జనకే లోబరుస్తున్నారు.
2. దేశంలో వున్న కార్మిక చట్టాలనన్నీ కాలరాస్తున్న కంపెనీకి ప్రభుత్వం పూర్తిగా మద్దతునివ్వటంతో పాటు, యూనియను పెట్టుకునే హక్కు వంటి కనీస హక్కుల కోసం (ఇది రాజ్యాంగమిచ్చిన హక్కు) పోరాడుతున్న కార్మికులను పని నుండి తొలగించివేయటానికీ, దానికడ్డువస్తున్న చట్టాలను తప్పించడానికి యాజమాన్యం సాగిస్తున్న కుట్రలకు అన్ని రకాలుగా వత్తాసు పలుకుతున్నది. హర్యానా ఫ్యాక్టరీని మూసివేసి కార్మికులను తొలగించటానికి, గుజరాత్‌లో పెడుతున్న ఫ్యాక్టరీకి అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నది. ఇదంతా చట్టబద్ధమని నమ్మబలుకుతున్నది.
3. మనకు పెట్టుబడి కొరత గనుక విదేశీ పెట్టుబడికి సౌకర్యాలు కల్పించక తప్పదని మరో వాదన. మారుతీలో సగం పెట్టుబడి దేశ పౌరుల పొదుపు సొమ్మే. దీనిపై పెత్తనం సుజుకీకిచ్చి లాభాలు తరలించుకుపోవటానికి ప్రజల పొదుపు సొమ్ముకు కనీస వడ్డీ కూడా రాకుండా చేశారు. ఒక ఏడాది రాయల్టీని తిరిగి పెట్టుబడి పెడుతుంటే మరోమాటల్లో, మన సొమ్ము మనకే యిచ్చినందుకు విదేశీ పెట్టుబడిదారులకు ఎక్కడలేని సౌకర్యాలు కల్పిస్తున్నారు. దళారీబూర్జువాల ప్రభుత్వ వంచనకు పరిమితమేముంది?! ★

సామ్రాజ్యవాద... (4వ పేజీ నుండి)

మనదేశంలో పారిశ్రామిక యాజమాన్యాలు, కాలకృత్యాలకు కార్మికులు వెచ్చించే సమయాన్ని కూడా నియంత్రిస్తున్నారు. పారిశ్రామికయాజమాన్యాలు సూపర్ లాభాలు పొందటానికి ఓ వరంగా, పారిశ్రామిక కార్మికులపాలిట శాపంలా - ఈ కాంట్రాక్టు కార్మిక వ్యవస్థ కొనసాగుతోంది. డిమాండ్‌లేదనే సాకుతో, పరిశ్రమలను కొద్ది రోజులపాటు మూసివేసేవిధానం వివిధ పరిశ్రమల్లోనూ ప్రత్యేకించి ఆటోరంగం, కార్ల తయారీ రంగాలలో - ప్రధానంగా కొనసాగుతోంది. ఇది కార్మికుల ప్రయోజనాలకు తీవ్ర విఘాతంగా వుంది.

ఆందోళనసాగించే కార్మికులను, వారి సమ్మెలను అణచివేసేందుకు, తద్వారా బేరసారాలాడే యూనియన్ల శక్తిని దిగజార్చేందుకు, చెన్నైలోని బిర్లాగ్రూపుకు చెందిన హిల్లాక్ కంపెనీ, చకన్‌లోని బజాజ్ ఆటో కంపెనీ, మానెసర్‌లోని మారుతి సుజుకి కంపెనీ, ఇటీవలి కాలంలో కర్ణాటకలోని టయోటా కిర్లోస్కర్ కంపెనీలలో అనుసరించిన విధంగా పరిశ్రమలలో ఉత్పత్తిని ఆపివేయటం, పరిశ్రమలను లాకౌట్‌చేయటం, ఉత్పత్తిని ఇతర ప్లాంట్లకు బదలాయించటం వంటి పద్ధతులు పరిశ్రమలలో సర్వసాధారణమయ్యాయి. (దోపిడీని తీవ్రపరిచే మారుతీ సుజుకీ సరికొత్త పద్ధతులు' **ఇదే పేజీలో చూడండి)**

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో భారతదేశంలోకొచ్చిన విదేశీ పారిశ్రామిక యాజమాన్యాలుగానీ; భారత పాలకులు, ప్రభుత్వాలు, చివరికి న్యాయస్థానాలుగానీ కార్మికుల ప్రయోజనంపట్ల, వారి దుస్థితిపట్ల ఏమాత్రం జాగ్రత్త వహించవు; వాటిని లక్ష్యపెట్టవు. ఇటీవల కాలంలో నోకియా యాజమాన్యం చెన్నైలోని తమ ప్లాంటులో పనిచేస్తున్న 8 వేలమంది కార్మికుల ఉద్యోగుల స్థితిగతులను నిర్ణయించకుండా ప్లాంటును అమ్మివేసి, వారి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయటమే దీనికి స్పష్టమైన ఉదాహరణ. భారతదేశంలో కార్మికులెదుర్కొంటున్న విషాద పరిస్థితులు, స్థితిగతులు ఈవిధంగా వున్నాయి.

సాంప్రదాయ ట్రేడ్ యూనియన్ నాయకత్వాలు - కార్మికులపై సాగుతున్న దారుణ దోపిడీ నుండి, వారిపై సాగుతున్న దాడుల నుండి కాపాడటంలో విఫలమవటమేగాక-వేతనాల చెల్లింపు నిరాకరణ, ఆందోళనకారులపై తప్పుడు కేసుల బనాయింపు, కాంట్రాక్టు వేతన వ్యవస్థలకు వ్యతిరేకంగా, కార్మికుల హక్కులను హరించే విదేశీ కంపెనీల దాడులను నిరసిస్తూ హర్యానాలోని గురుగావ్ - రావెల్ ప్రాంతంలో కార్మికులు తమ హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన కొన్ని స్థానిక ఆందోళనలనైనా ముందుకు కొనసాగించి వానికి విస్తృత ప్రాచుర్యం కల్పించటంలోనూ అవి విఫలమౌతున్నాయి. తమ వేతనాల పెంపుకోసం, ఇతర సదుపాయాల కోసం తమిళనాడులోని పవర్‌లూమ్ కార్మికుల సమ్మె మరియు తమిళనాడులోని శ్రీపెరంబదూర్‌లో, కర్ణాటక రాష్ట్రం - టయోటా కిర్లోస్కర్ ఆటో కార్మికుల ఇటీవల ఆందోళన మరియు అప్పటికప్పుడు బ్రద్దలవుతోన్న ఇతర అనేక కార్మికుల ఆందోళనలు - భారత కార్మికులు బడా పెట్టుబడికి, దాని దాడులకు, అమానవీయ దోపిడీకి మౌనంగా లొంగిపోబోరని, వాటికి వ్యతిరేకంగా ధీరోదాత్తంగా పోరాడుతారనే ఆశారేఖను ప్రసరింపజేస్తోన్నాయి.

ఆశాకిరణం

కార్మికుల ప్రయోజనాల వైపునుండి స్వీయాత్మక పరిస్థితులు ఈనాడు వెనుకపట్టులో వున్నాయనే దానిలో సందేహంలేదు. అయితే, భౌతిక పరిస్థితులు పరిపక్వమై వున్నాయని అంతులేకుండా సాగుతోన్న దోపిడీ పరిస్థితులు తెలియజేస్తోన్నాయి. దోపిడీ, అసమానతలతోకూడిన ఈ దుర్మార్గమైన పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడేందుకు ఇదే నిర్ణాయక అంశంగా వుంటుంది. ఇప్పుడు, ఈ సందర్భంలోనే మేడే ప్రాధాన్యత ముందుకొస్తుంది. నిస్వార్థంగా, అంకిత భావంతో, త్యాగపూరితంగా పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా 8 గంటల పనిదినం కోసం పోరాడి అమరులైన ఆనాటి చికాగో కార్మికుల అమరత్వం ఈనాటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. ఇది భారతదేశ అశేష శ్రామికులకు, కార్మికవర్గానికేగాక, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను అంతంగావించే, తమకు చరిత్ర నిర్దేశించిన వర్గపాత్ర పరిపూర్తి అయ్యేదాకా ప్రపంచవ్యాపిత కార్మిక వర్గానికి ఉత్తేజితంగా నిలుస్తుంది. ఆనాటిదాకా కార్మికులకు మేడే ప్రాధాన్యత మసకబారిపోయేదిగాకాక, మరింత ఉత్తేజకరమైందిగా వుంటుంది.

ఈ మేడేనాడు కార్మికులందరూ తమ సహజవర్గ స్వభావమైన పోరాటస్ఫూర్తిని, సామర్థ్యాన్ని పునరుజ్జీవింపజేసుకునేందుకు; కార్మికవర్గం-తమలో తాము ఒక వర్గంగా ఐక్యం, సంఘటితమయ్యేందుకు, ప్రతినబూనాలి. కార్మికులు తమ వర్గ అవగాహనను పైకెత్తిపట్టి, అంతిమంగా చరిత్ర తమ భుజస్కంధాలపై వుంచిన కార్మికవర్గ పాత్రను నిర్వహించేందుకు, అవసరమైన అన్ని చొరవలనూ ప్రదర్శించాలి.

- **మేడే వర్ధిల్లాలి!**
- **సకలదేశ కార్మికులారా! ఏకంకండి!** ★

కార్మిక – రైతాంగ... (చివరిపేజీ నుండి)

కార్మిక రైతాంగ ఐక్యపోరాట ఆవశ్యకతను పేర్కొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా

పశ్చిమగోదావరి జిల్లా – **కొవ్వూరు మండలం**, ఐ.పంగిడి గ్రామంలో ఏఐఎఫ్‌టియు(న్యూ) దిమ్మె వద్ద సీనియర్ కామ్రేడ్ పి. నాగేశ్వరరావు ఎర్రజెండాను ఆవిష్కరించారు. **దేవరపల్లి మండలం** – లక్ష్మీపురంలో కామ్రేడ్ పోలుమాటి నాగేశ్వరరావు స్మారకచిహ్నం వద్ద క్వారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కా॥ పి. పెంటయ్య ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో క్వారీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కా॥ ఎం.ఎన్. నాగరాజు; వలి

అయిత్తపల్లి

తదితరులు మేడే చరిత్రను, కార్మికుల ఐక్యపోరాట ఆవశ్యకతను వివరించారు.

కృష్ణా జిల్లా

కార్మికవర్గ దీక్షాదినం మేడేని పురస్కరించుకుని సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో **బందరు** – కోనేరు సెంటర్ బట్టల బజారులో కా॥ సయ్యద్ అబ్దుల్లా స్మారక స్థూపం; జెడ్‌పి సెంటర్‌లోని కా॥ భోగాదుల రామారావు అమరస్థూపం; మున్సిపల్ ఆఫీస్ వద్ద గల కా॥ పినపాల బాబు స్మారకస్థూపం; ఇంగ్లీషు పాలెంలోని కా॥ భోగాదుల రామారావు స్మారక గ్రంథాలయం; దిమ్మల సెంటర్ పెదకరగ్రహారంలోని కా॥ తరిమెల నాగిరెడ్డి స్మారక స్థూపం – సెంటర్‌లలో ఎర్రజెండాలు ఆవిష్కరించారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో గిలకలదిండి ఆటోస్టాండ్, మంగినపూడి ఆటోస్టాండ్, చిలకలపూడి ఆటోస్టాండ్ – రైల్వేకోచ్ క్లీనింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సెంటర్; గుప్త సెంటర్ ఆటోస్టాండ్; కోటవారి తుళ్ళ ఆటోస్టాండ్; రాజుపేట ఆంధ్ర హాస్పటల్ సెంటర్ ఆటోస్టాండ్; నాగపోతరావు ఆటోస్టాండ్; కోనేరు సెంటర్ ఆటోస్టాండ్; బేబి సెంటర్ టాటా మ్యాజిక్ ఆటోస్టాండ్; రైతుబజారు ముఠావర్కర్స్ యూనియన్ సెంటర్, టు టౌన్ ముఠా వర్కర్స్

విజయవాడ

యూనియన్ కార్యాలయం, సిద్ధబ్బసి గోడౌన్ సెంటర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ సెంటర్, ప్రభుత్వ హాస్పిటల్ సెంటర్ ఆటోస్టాండ్–1, 2; పరాశుపేట సెంటర్ ఆటోస్టాండ్ సెంటర్‌లలో మేడే జెండాలను ఉత్తేజపూరిత వాతావరణంలో ఆవిష్కరించారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో **మచిలీపట్నం** – అరుణోదయ కాలనీ; ఆదర్శనగర్; పెదపట్నం; పెదయాదర సెంటర్; కొత్త కాలనీ; చిన్నాపురం; కృష్ణానగర్; గుండుపాలెంలోని ఈడ్పుగంటి జగన్మోహన్‌రావు స్మారకస్థూపం; గుండుపాలెం దళితవాడ; పల్లె తుమ్మలపాలెం; కోలాటితిప్ప; కొత్తకాలనీ సెంటర్‌లలో కార్మికులు, రైతుకూలీలు ఎర్రజెండాలను ఆవిష్కరించారు.

ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో ఏఐఎఫ్‌టియు(న్యూ) ప్రధాన కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని, సంఘనాయకులు కా॥ ముచ్చు సుధాకర్, బెల్లంకొండ రవి; స్త్రీవిముక్తి సంఘటన నాయకులు నాంచారమ్మ, రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కామ్రేడ్స్ అంజమ్మ, జగన్, కె. నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు మరియు ఆయా యూనియన్‌ల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా – **గుడ్లవల్లేరు** గ్రామ దళితవాడ; **చల్లపల్లి** గ్రామంలో నారాయణరావు నగర్ సెంటర్; కోమలా నగర్ సెంటర్, శివరామ దుర్గాపురం సెంటర్; **ఘంటశాల మండలం**, వి. రుద్రవరం దళితవాడ కేంద్రాలలో రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥ ఈపూరి రాంబాబు, రావి సుబ్బారావు తదితరులు మేడే జెండాలను ఆవిష్కరించారు.

విజయవాడ నగరంలో సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో గిరిపురం తరిమెల నాగిరెడ్డి స్థూపం సెంటర్; ట్రైలర్ పేట; కృష్ణలంక; చర్చ్ సెంటర్; అరుల్ నగర్; నిడమానూరు గోడౌన్ సెంటర్‌లలో అరుణ పతాకాలను ఆవిష్కరించి మేడే ప్రాధాన్యతను వివరించారు. నగరంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో సిపిఐ(ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి ముప్పాళ్ళ భార్గవశ్రీ ఇంకా కా॥ మీసాల వెంకట్రావ్, కా॥ ఏసు, కా॥ లక్ష్మణరావు తదితరులు పాల్గొని కార్మికవర్గ కర్తవ్యాలను వివరించారు.

గుంటూరు జిల్లా

గుంటూరు జిల్లా–**రేపల్లె మండలం** – చెన్నుపల్లి వారిపాలెం బస్టాండు సెంటర్‌లో సిపిఐ(ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ ముత్తిరెడ్డి శ్రీరాములు అరుణపతాకాన్ని ఆవిష్కరించి అమర వీరులందరికీ జోహార్లర్పించారు.

రేపల్లె ఓల్డు టవున్ సెంటర్‌లో పార్టీ సీనియర్ కా॥సముద్రాల లాజరస్; పేటేరులోని ఆంజనేయస్వామి కాలనీలో దొంతు శ్రీనివాసరావు ఎర్రజెండాలను ఎగురవేసి, మేడేని జాతరగా కాకుండా పోరాటస్ఫూర్తిని నింపేదిగా వివరించారు. ఈ కార్యక్రమాలలో గ్రామ ప్రజలు, చేనేత కార్మికులు ఇంకా ఎన్‌వైయన్ నాయకులు కా॥ రాజేశ్వరి, చేనేత సంఘం నాయకులు వెంకట్రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

నిజామాబాద్

కారంపూడి మండలంలో మేడే సందర్భంగా మే 2వ తేదీన పోతురాజుగుట్ట కాలనీ; ఇటుకబట్టీలు; కారంపూడి సెంటర్‌లలో మేడే పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో కామ్రేడ్స్ పద్మ, నాగలక్ష్మి, పున్నయ్య; కాలనీవాసులు, బట్టీ కార్మికులు పాల్గొన్నారు.

అంచులవారి పాలెంలో, అంబేద్కర్ గిరిజన కాలనీలో మే 3న; కోనంకి శివారు అల్లూరి సీతారామరాజు కాలనీలో మే 5న; బ్రాహ్మణపల్లిలోని భగత్‌సింగ్‌నగర్‌లో మే 6న అరుణపతాకాలనావిష్కరించి మేడే అమరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో కార్మికులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని కామ్రేడ్స్ నొక్కి చెప్పారు.

పిడుగురాళ్ళ మండల కేంద్రంలో – లెనిన్‌నగర్, పోలీస్‌స్టేషన్ సెంటర్, చైతన్య ఎరువుకొట్ల వర్కర్స్ యూనియన్ సెంటర్, చైతన్య బజారు ముఠా వర్కర్స్ యూనియన్ సెంటర్; ఐరన్‌కొట్ల ముఠా యూనియన్ సెంటర్; బల్లరిక్షా వర్కర్స్ యూనియన్ సెంటర్; రైసుమిల్లు వర్కర్స్ యూనియన్ సెంటర్; సున్నంబట్టీల వర్కర్స్ యూనియన్ సెంటర్; సున్నం మిల్లుల వర్కర్స్ యూనియన్ సెంటర్; కా॥ విశ్వమోహనరెడ్డి కాలనీ సెంటర్; కా॥ తరిమెల నాగిరెడ్డి కాలనీ సెంటర్లలలో

రేపల్లె

ఏఐఎఫ్‌టియు(న్యూ), సిపిఐ(ఎం-ఎల్), రైతుకూలీ సంఘాల ఆధ్వర్యంలో మేడేజెండాలను ఆవిష్కరించారు. ఆయా సెంటర్‌లలో కార్మికులను, కాలనీవాసులను ఉద్దేశించి గ్రూపు సమావేశాలు నిర్వహించి మేడే స్ఫూర్తితో ఐక్యపోరాటాలకు సంసిద్ధంకావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాలలో ఆయా యూనియన్ల, ప్రజాసంఘాల నాయకులు కామ్రేడ్స్ నీలాద్రి రాంబాబు, కొండారెడ్డి చెన్నయ్య, సత్యనారాయణ, సరళ, రామకోటేశ్వరరావు, హుస్సేన్, కాంతారావు, శ్రీను, వెంకటరెడ్డి తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

రెంటచింతల మండలం – రెంటచింతల, జెట్టిపాలెం, మల్లవరం, పాలువాయి జంక్షన్,

గుంటూరు

పాలువాయిగేటు, తుమ్మకోట, పశర్లపాడు, మంచికల్లు గ్రామాలలో రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో మేడే పతాకాలను ఆవిష్కరించారు.

దుర్గిమండలం–దుర్గి, పల్లెవనం, పోలేపల్లి, మంగాపురం తండా కేంద్రాలలో అరుణపతాకాల నావిష్కరించి మేడే సందర్భంగా పోరాట దీక్షను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర)జిల్లా అధ్యక్షులు కా॥పాటిబండ్ల కోటేశ్వరరావు; సీనియర్ కమ్యూనిస్టు కా॥ సురభి అమరలింగం, సత్తయ్య, కొండలు ఇంకా గ్రామకమిటీల సభ్యులు, రైతుకూలీలు పాల్గొన్నారు. పీడిత ప్రజా పోరాటాలను ముందుకు గొనిపోవాలని కష్టజీవులు ప్రతినబూనారు.

మంగళగిరి–రతనాలచెరువులోని శ్రామికనగర్‌లో పాతర్ల నాగయ్య స్మారక చిహ్నం సెంటర్‌లో ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥జగ్గారపు సుబ్బారావు మేడే జెండాను ఆవిష్కరించి, మేడే ప్రాధాన్యతను వివరించారు. మంగళగిరి సెంటర్; లక్ష్మి నరసింహస్వామికాలని; మంగళగిరి, తాడేపల్లిలోని చైతన్య భవన నిర్మాణ కార్మికసంఘం సెంటర్‌లలో ఎర్రజెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో కామ్రేడ్స్ కూరపాటి కోటయ్య, కాసిన కొండలు, రాందాన్‌లతోపాటు భవన నిర్మాణ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తాడేపల్లి మండలం–కేసి వర్క్స్ సిమెంటు ఫ్యాక్టరీ, బ్రహ్మానందపురం, కా॥పాతర్ల నాగయ్య గ్రంథాలయం సెంటర్‌లలో ఎర్రజెండాలను ఆవిష్కరించి మేడే ప్రతినబూనారు. ఈ కార్యక్రమాలలో కామ్రేడ్స్ కె. ఆదినారాయణ, రాచకొండ శివ, అబ్రహాం, మోజెస్, ఓబులేసు మరియు పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

పల్నాడు

గుంటూరునగరం–చుట్టుగుంట సెంటర్‌లోని పున్నయ్య – శంకర్‌లభవన్ సెంటర్; అగ్రికల్చరల్ మార్కెటుయార్డు సెంటర్; బల్ల రిక్షావర్కర్స్ యూనియన్ సెంటర్, దిగుమతి ముఠావర్కర్స్ యూనియన్‌సెంటర్, తోలకం ముఠావర్కర్స్ యూనియన్ సెంటర్‌లలో ఏఐఎఫ్‌టియు(న్యూ), నాయకులు, ఆయా యూనియన్ల బాధ్యులు ఎర్రజెండాలను ఎగురవేసి మేడే అమరుల ఆశయాన్ని కొనసాగిస్తామని నినదించారు.

యతిరాజనగర్, కృష్ణబాబుకాలని, గోయల్ కాలని, వెంకటప్పయ్యకాలని సెంటర్‌లలో; పల్నాడు బస్టాండులోని మిర్చియార్డు ఆటోడ్రైవర్స్ యూనియన్ కార్యాలయంవద్ద మేడే జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమాలలో సిపిఐ (ఎం-ఎల్) నాయకులు కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, దేవరశెట్టి వెంకటస్వామి, కె. హనుమంతరావు ఇంకా వివిధ యూనియన్ల నాయకులు షేక్ ఖాజావలి, రాగం అప్పారావు, మల్లి, ప్రభాకర్, ఆంద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశంజిల్లా

ఒంగోలు – ఈమనిపాలెం సిపిఐ(ఎం.ఎల్) జిల్లా కార్యాలయంవద్ద మేడే జెండాను జిల్లానాయకులు కా॥లలితకుమారి ఆవిష్కరించారు. బిఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసు, ఆర్‌టిసి డిపో ఆవరణ సెంటర్‌లలో ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో మేడే పతాక విష్కరణలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో సంఘం రాష్ట్రనాయకులు కా॥ఎం.ఎస్.సాయి, జిల్లా నాయకులు కా॥కత్తి పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం మండలం – వలసపాలెం; బస్టాండ్ సెంటర్‌లలో మేడే జండా ఆవిష్కరణలు నిర్వహించారు. వలసపాలెంనుండి రంగాయపాలెం, ముస్లింపేట మీదుగా కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ వరకు **ప్రదర్శన** నిర్వహించారు.

మోటుమాలలో ఆటోస్టాండ్ సెంటర్‌వద్ద ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే జండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో కా॥వాటంబేటి శ్రీరాములు, పి.సురేంద్ర, కా॥కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చీరాల, వేటపాలెం మండలాలలోని పలు కార్మిక కేంద్రాలలో ఏఐఎఫ్‌టియు(న్యూ) మరియు ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామికవర్గ దీక్షాదినాన్ని స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు.

ఈపూరుపాలెం, రామానగర్, శాంతినగర్, అణుమల్లిపేట, చిన్నబజారుసెంటర్, పందిళ్ళపల్లి కేంద్రాలలో అరుణపతాకాలను ఆవిష్కరించారు. సామ్రాజ్యవాద, దళారీ పాలకుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా నినదించారు. ఈ కార్యక్రమాలలో కామ్రేడ్స్ వార్తికోట సుబ్బారావు, గుద్దంటి సుబ్బారావు, నందం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని ప్రస్తుత రాజకీయపరిణామాలు – కార్మికవర్గం ముందున్న

మంగళగిరి

సమస్యలను, కర్తవ్యాలను వివరించారు.

వేటపాలెం సెంటర్‌లోని అమరవీరుల స్థూపంవద్ద ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ ఎన్. కుటుంబరావు ఎర్రజెండాను ఆవిష్కరించి మృతవీరులకు నివాళులర్పించారు.

నెల్లూరుజిల్లా

మేడే సందర్భంగా **నెల్లూరు** జనశక్తినగర్‌లో సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో ఎర్రజెండాను ఆవిష్కరించారు. నెల్లూరులోని గాంధీ విగ్రహంసెంటర్‌లో ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ సండే మార్కెట్ కమిటి ఆధ్వర్యంలో అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. మేడే మృతవీరులకు జోహార్లర్పించారు. ఈ కార్యక్రమాలలో స్త్రీవిముక్తి సంఘటన నాయకులు కా॥ కొండమ్మ, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) నాయకులు కా॥ ఎ. కృష్ణారెడ్డి, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ పి. యానాదయ్య తదితరులు పాల్గొని కార్మికవర్గం ఎదుర్కొంటున్న సవాళ్ళను, వారి ముందున్న కర్తవ్యాలను వివరించారు. బాలకళాకారులు మేడే అమరులపై పాటలు పాడారు. ఆయా సెంటర్‌లలో యూనియన్ల నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

కర్నూలు జిల్లా

కర్నూలుజిల్లా – **నంద్యాలలో** తెలుగు గంగ హెచ్ ఆర్ కార్మికుల ఆధ్వర్యంలో ఎస్ఇ కార్యాలయం సెంటర్‌లో సంఘం కార్యదర్శి కా॥ సురేష్ మేడే జెండాను ఆవిష్కరించారు. సమస్యల పరిష్కారానికి

విశాఖపట్నం

ం పోరాటమే ఏకైక మార్గమని నినదించారు. ఇంకా ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కా॥ దుర్గాప్రసాద్, సుబ్బారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

వెలుగోడు – తాలూకా కార్యాలయ ఆవరణలోని తెలుగుగంగ హెచ్ ఆర్ కార్మికుల సెంటర్‌లో ఎర్రజెండాను ఆవిష్కరించి మేడే ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కా॥ ఎస్‌కెవలి, వీరభద్రుడు, మల్లేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం

అనంతపురం జిల్లా

అనంతపురం జిల్లా – **రాయదుర్గం** పట్టణంలోని ఏఐఎఫ్‌టియు (న్యూ) అనుబంధ రోడ్డు మార్జిన్ వ్యాపారుల సంక్షేమ సంఘం సెంటర్; లక్ష్మిబజారు సెంటర్; జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల సెంటర్‌లలో; **రాయదుర్గం మండలం** – ఆయత్తపల్లిలోని ఆర్‌డిటి పాఠశాల సెంటర్‌లలో మే 1న; ఆర్. ఉడేగోళం; అనంతపురం రోడ్డు సెంటర్‌లో మే 4న – మేడేజెండా ఆవిష్కరణలను రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు.

కణేకల్లు మండలం – మాల్యం సెంటర్; గోపాలపురం సెంటర్; ఆదిగానిపల్లి; గంగులాపురం కేంద్రాలలో అరుణపతాకాలను ఆవిష్కరించి మేడే మృతవీరులకు జోహార్లర్పించారు.

అనంతరం రైతుకూలీసంఘం, ఏఐఎఫ్‌టియుల ఆధ్వర్యంలో మార్కెట్ సెంటర్ నుండి బస్టాండు వరకు 100 మంది ఆటో కార్మికులు, రైతు, కూలీలు **ప్రదర్శన** నిర్వహించి మేడే ప్రాధాన్యతను ఎలుగెత్తి చాటారు. బస్టాండ్ సెంటర్‌లో మేడే జెండాను కణేకల్లు ఆటో యూనియన్ కార్యదర్శి కా॥ కె. నాగరాజు ఎగుర వేశారు. కార్మికవర్గ రాజ్యస్థాపన కోసం ప్రతినబూనాలని ఈ సందర్భంగా రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి కా॥ బి.తిమ్మారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాలలో ఇంకా కామ్రేడ్స్ లక్ష్మణ్ణ, జి. నరసింహులు, అంజనయ్య, విజయకుమార్, హరిబాబు, వీరేశ్, జయన్న, రామన్న, మల్లిఖార్జున తదితరులు పాల్గొని కార్మికుల ఐక్య పోరాటాల ఆవశ్యకత గురించి మాట్లాడారు.

అనంతపురం పట్టణంలో – ఎమ్. ఎస్. నగర్; బళ్ళారి బైపాస్ ఆటోస్టాండ్ సెంటర్; ఆయిల్ ఫేక్ హమాలీ యూనియన్ సెంటర్; స్టాలిన్ నగర్ ఆటోస్టాండ్ సెంటర్; స్టాలిన్ నగర్; రజక నగర్; ఫోర్తురోడ్ ఆటోస్టాండ్ సెంటర్; థర్డ్ రోడ్ ఆటోస్టాండ్ సెంటర్; విఠోబా ఆలయం ఆటోస్టాండ్ సెంటర్; హెచ్‌ఎల్‌సి కాలనీ ఆటోస్టాండ్ సెంటర్; రజనీబార్ ఆటోస్టాండ్ సెంటర్; పవర్‌హౌస్ ఓల్డు టవున్ ఆటోస్టాండ్ సెంటర్; ఫిఫ్తురోడ్ ఆటోస్టాండు సెంటర్; తాడిపత్రి బస్‌స్టేషన్ ఆటోస్టాండ్ సెంటర్; ఏఐఎఫ్‌టియు(న్యూ) కార్యాలయం సెంటర్లలో ఏఐఎఫ్‌టియు(న్యూ) మరియు దాని అనుబంధ


విజయనగరం

యూనియన్ల కార్మికుల ఆధ్వర్యంలో ఉత్సాహపూరిత వాతావరణంలో మేడే జెండాలను ఎగురవేశారు.

మేడేరోజు సాయంత్రం అనంతపురం టి.ఎన్. శ్రామిక భవనం నుండి నీలిమా థియేటర్, సెకండ్ రోడ్, నాల్గవ రోడ్, శాంతినగర్‌ల మీదుగా 60 ఆటోలతో, 300 మంది కార్మికులతో **ప్రదర్శన** నిర్వహించారు. ప్రదర్శన ముందుభాగాన డప్పు డ్యాన్సు, కోలాటం, బాల కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

రజకనగర్ కమ్యూనిటీహాల్‌లో జరిగిన మేడే బహిరంగసభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సి. పెద్దన్న పాల్గొని, ఈ వ్యవస్థ మార్పులో కార్మికవర్గం నిర్వహించాల్సిన కర్తవ్యాలను ప్రధానంగా వివరించారు. మొత్తంగా ఈ కార్యక్రమాలలో ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కామ్రేడ్స్ సి.ఆర్. ఖాన్; ఇంకా కామ్రేడ్స్ ఓబులేసు, చంద్రశేఖర్, భవననిర్మాణ కార్మికసంఘం నాయకులు కా॥ సుధాకర్, కా॥ లక్ష్మినారాయణ, కా॥ నాగభూషణం, మరియు రైతుకూలీసంఘం, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు మండలం – వై కొత్తపల్లిలోని తరిమెల నాగిరెడ్డికాలనీలో మే 3న మేడే జెండాను ఆవిష్కరించిన అనంతరం సభ నిర్వహించి మేడే ప్రాధాన్యత, కార్మికరంగ కర్తవ్యాలను వక్తలు వివరించారు.

కరీంనగర్ జిల్లా

కరీంనగర్ జిల్లా – **బావుపేటలో** ఏఐఎఫ్‌టియు (న్యూ) అనుబంధ గ్రానైట్ అండ్ క్వారి, గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్, సైజింగ్ అండ్ డైయింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎప్పటిలాగానే ఈ సంవత్సరమూ మేడే సందర్భంగా **భారీ కార్మిక ప్రదర్శన**, బహిరంగసభలతో బావుపేట ఎరుపెక్కింది.

తొలుత బావుపేట సెంటర్‌లో కార్మికోద్యమ నాయకుడు కామ్రేడ్ ఎన్ వి కృష్ణయ్య విగ్రహానికి రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కా॥ కె. కోటయ్య పూలమాల వేసి జోహార్లర్పించారు. మేడే జెండాను ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ వి. కిషోర్ ఆవిష్కరించి అమరులందరికీ జోహార్లర్పించారు. ఎన్‌వైయస్ జిల్లా కార్యదర్శి కా॥ బామండ్ల రవీందర్ అధ్యక్షతన జరిగిన మేడే బహిరంగ సభలో న్యాయవాది కాశీరాం, జెఏసి నాయకులు కనకయ్య ప్రసంగించారు. కా॥ కె. కోటయ్య తన ప్రసంగంలో మేడే ప్రాధాన్యత, కార్మికవర్గ కర్తవ్యాలను వివరించారు. సుత్తి – కార్మికులకు, కొడవలి – రైతుకూలీలకు చిహ్నమని చెపుతూ, కార్మిక–రైతాంగ ఐక్యపోరాటాల ద్వారానే పాలకుల మెడలు వంచ గలుగుతామన్నారు. క్వారీ కార్మికుల యూనియన్ నాయకుడు కా॥ వి. కిషోర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని వివిధ విభాగాల కార్మికులంతా సాగించిన ఐక్యపోరాటాల ఫలితంగానే ఈ మేరకైనా హక్కులను సాధించుకోగలుగుతున్నామని గుర్తుచేశారు. కరీంనగర్ ఇతర తెలంగాణా జిల్లాల నుండి 'కల్లిబిల్లి' కార్మికులుగా వలసలు వెళ్ళి యమగోసలు పడుతున్న తీరులోనే బీహార్, ఒరిస్సా, రాజస్థాన్, తమిళనాడు, తదితర రాష్ట్రాల నుండి భార్యాబిడ్డల్ని వదలి వచ్చిన కార్మికుల యాతనలు వర్ణించనలవికావన్నారు. ఈ స్థితిలో ఐక్యపోరాటాలకు ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు. ప్రజాకళాకారిణులు వాణి తదితరుల బృందం పాడిన పాటలు, ఇచ్చిన ప్రదర్శనలు కార్మికులను ఆకట్టు కున్నాయి.

నల్గొండజిల్లా

నల్గొండజిల్లా–**నడిగూడెంమండలం**–రాయపురం గ్రామంలో సిపిఐ(ఎం–ఎల్) ఆధ్వర్యాన మేడేను పురస్కరించుకొని సభ జరిగింది. తొలుత ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥వెంకటేశ్వర్లు ఎర్రజెండాను ఎగురవేశారు. పార్టీ నాయకులు కా॥జక్కుల నర్సింహ; బండారు వేలాద్రి తదితరులు పాల్గొని ప్రస్తుత రాజకీయ పరిణామాలను, కార్మికుల ముందున్న కర్తవ్యాలను వివరించారు.

మేడే సందర్భంగా **ఆలేరు మండలం** – ఆలేరు బిసికాలని; మంత్రపురి, ఇక్కుర్తి, శారాజీపేట కేంద్రాలలో ఎర్రజెండాలను ఆవిష్కరించారు.

రాజంపేట మండలం – రాజంపేట, రఘునాధ పురం, సోమారం గ్రామసెంటర్; కామ్రేడ్ బల్లెం నర్సింహులు స్థూపంసెంటర్‌లలో అరుణ పతాకాలను ఆవిష్కరించారు.

యాదగిరిగుట్ట మండలం–బావుపేట; **భువనగిరి మండలం**–జే.కేసారం;**ఆత్మకూరు మండలం**–రాయిపల్లి; **మోత్కూరు మండలం**–బుజులాపురం; **తిర్మలగిరి మండలం**–తిర్మలగిరి, వైశాలిక్రాస్‌రోడ్ సెంటర్, కా॥ శాయన్న స్థూపం సెంటర్‌లో మేడే జెండాలను ఎగురవేశారు.

తుంగతుర్తి మండలం–వెలుగుపల్లి, గుమ్మడవెల్లి; **నక్రేకల్ మండలం**–నక్రేకల్, కొండారం, కంటగుర్‌లలో; **మేతే మండలం**–హసీనాబాద్, బుర్కచర్ల, గోల్‌తండా, ఇబ్రామ్‌పురం, తుమ్మలపల్లి గ్రామ కేంద్రాలలో ఎర్రజెండాలను ఆవిష్కరించి మేడే మృతవీరులకు జోహార్లర్పించారు.

ఈ మేడే జెండా ఆవిష్కరణ కార్యక్రమాలలో సిపిఐ(ఎం–ఎల్), ఏఐఎఫ్‌టియు(న్యూ) మరియు అనుబంధ తాపీమేస్త్రీ సంఘం, ఆటో యూనియన్, హమాలి కార్మిక సంఘాలు; రైతుకూలీసంఘం; పిఓడబ్ల్యు (స్త్రీవిముక్తి) సంఘాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, రైతు–కూలీ గ్రామీణ పేదలు పెద్దసంఖ్యలో పాల్గొని ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమాలలో సిపిఐ(ఎం–ఎల్) జిల్లా నాయకులు కామ్రేడ్స్ కిమిడి ఉప్పలయ్య; వివిధ ప్రజాసంఘాల నాయకులు కందుకూరి కొండయ్య, పోరండ్ల మల్సూరు, కొమ్ము నర్సయ్య, కిమిడి జ్యోతి, కస్తూరి సావిత్రి, కుర్మిండ్ల బాబు, మొగిళ్ళ నర్సింహులు

విజయనగరం

తదితర నాయకులు పాల్గొని ఆయా కూడళ్ళలో మేడే ప్రాధాన్యతను, కార్మిక, రైతాంగ ఐక్య పోరాటాల ఆవశ్యకతను వివరిస్తూ ప్రసంగించారు.

వరంగల్‌జిల్లా

వరంగల్‌జిల్లా–**నర్సంపేట మండలం**–రాజంపేట గ్రామంలోని శ్రీసాయి, హరికృష్ణ, హేమాత, ఉమా శంకర్, రూపా, ఉషాకిరణ్ పరిశ్రమలవద్ద, శ్రామిక కేంద్రాలలో హమాలీలు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో మేడే జెండాలను ఆవిష్కరించారు.

ద్వారకపేటలోని ఎంజెఆర్; సర్వాపురంలోని శ్రీరామ; మహేశ్వరం గ్రామంలోని అశోకా, బండారి, తారకప్రభు, రోహిణి, ఉమాపతి, విఘ్నేశ్వర ఇండస్ట్రీస్ సెంటర్‌లలో అరుణపతాకాలనావిష్కరించి మేడే మృతవీరులకు జోహార్లర్పించారు. ఈ కార్యక్రమాలలో ఆయా యూనియన్ల నేతలు చింతల యాకయ్య, బొల్లి శ్రీను, ముత్తినేని లక్ష్మయ్య, దూడన్న, మొగిలి, రాజేందర్ తదితరులు పాల్గొని కార్మికులనుద్దేశించి ప్రసంగించారు.

దుగ్గొండి మండలం – చలపర్తి గ్రామంలోని న్యూముబారక్, వినాయక, గిర్నిబావిలోని లక్ష్మిసాయి, శ్రీలక్ష్మిఇండస్ట్రీస్ కేంద్రాలలో; రేఖంపల్లి, తిమ్మంపేట, మహ్మదాపురం సెంటర్‌లలో జరిగిన మేడే జెండా ఆవిష్కరణలలో స్థానికహమాలీలు, ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామ్రేడ్స్ రాజు, స్వామి, కత్తి రాములు తదితరులు కార్మికుల కర్తవ్యాలను వివరించారు.

నల్లబెల్లి మండలం–శనిగరం గ్రామంలోని భార్గవి, అన్నపూర్ణ ఇండస్ట్రీ కేంద్రాలలో కామ్రేడ్స్ రాజేందర్, రవిలు మేడే పతాకాలావిష్కరించారు.

నెక్కొండ మండలం–భవాని, చక్‌ముఖ, ధనలక్ష్మి ఆయిల్‌మిల్, కాటన్ ఇండస్ట్రీస్; గ్రెయిన్ మార్కెట్ కార్యాలయంసెంటర్‌లలో ఉత్తేజపూరిత వాతావరణంలో కార్మికులు మేడేనుజరుపుకున్నారు. ఈ కార్యక్రమాలలో కామ్రేడ్స్ మహేందర్, మల్లయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం మండలం – బుధరావుపేట, మనుబోతులగడ్డ, బండమీది మామిడి తండా గ్రామీణ ప్రాంత కేంద్రాలలో; ఖిలావరంగల్‌లో స్థానిక హమాలీలు ఉత్సాహపూరితంగా మేడే నిర్వహించారు.



విజయనగరం

నర్సంపేటడివిజన్‌లోని సర్వాపురం, మహేశ్వరం, గిర్నిబావి, నల్లబెల్లి గ్రామాలలోని ఫైయాష్‌పరిశ్రమలున్న 9 సెంటర్లలో ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో హమాలీలు పెద్దసంఖ్యలో కదిలి స్ఫూర్తిదాయకంగా మేడే జరిపారు. ఈ కార్యక్రమాలలో కామ్రేడ్స్ అన్వర్, శ్రీశైలం, దండు నాగరాజు తదితరులు పాల్గొని మేడే జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో ఏఐఎఫ్‌టియు(న్యూ) వరంగల్‌జిల్లా కార్యదర్శి కా॥ మోడెం మల్లేషం; ఇంకా రైతుకూలీ సంఘం, యువజన సంఘం కామ్రేడ్స్ పాల్గొని మేడే ప్రాధాన్యతను వివరించారు.

నిజామాబాద్ జిల్లా

నిజామాబాద్ రూరల్ ప్రాంతంలోని పాంగ్రా గ్రామం శ్రామికనగర్‌లో రైతుకూలీసంఘం నిజామాబాద్ జిల్లాకమిటి ఆధ్వర్యంలో మేడేనాడు 400మంది ప్రజలు ప్రదర్శన నిర్వహించి, ఆపై మేడే జెండాను ఆవిష్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘంజిల్లా కార్యదర్శి కా॥గంగుల నర్సయ్య కార్మిక, రైతాంగ ఐక్యపోరాట ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంకా కామ్రేడ్స్ మల్లేష్, మారుతి, రజియా, నర్సింహులు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

విజయనగరంజిల్లా

విజయనగరంజిల్లా **పూసపాటిరేగ మండలం** కోపర్లలోని విజయనగరం బయోటెక్ కంపెనీవద్ద విజయనగరం బయోటెక్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అరుణ పతాకాను యూనియన్ ఉపాధ్యక్షుడు టి.అక్కునాయుడు ఆవిష్కరించారు. అనంతరం మేడే సభ జరిగింది. ఈ సభకు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.తౌడు అధ్యక్షత వహించారు. ఈ సభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి మరియు యూనియన్ ప్రెసిడెంట్ కామ్రేడ్ గణేష్ పండా మాట్లాడుతూ మేడే అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలను తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జాయింట్ సెక్రటరీ పి. అచ్యుతరావు, కోశాధికారి యస్. రాంబాబు, ఇతర యూనియన్ నాయకులు మరియు 200 ఫ్యాక్టరీ కార్మికులు పాల్గొన్నారు.

విజయనగరంజిల్లా, పూసపాటి రేగ మండలం, జి. చోడవరంలో ఉన్న మైలాన్ ఉద్యోగస్తులు మరియు కాంట్రాక్టు కార్మికులు సంయుక్తంగా విధులు బహిష్కరించి మేడేను నిర్వహించారు. కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. అప్పలనాయుడు; మైలాన్ సాఫ్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గోవిందరావుల ఆధ్వర్యంలో అరుణపతాకాలను ఆవిష్కరించి కంపెనీ గేటువద్ద బహిరంగసభను నిర్వహించారు. ఈ సభకు జి.వి.రమణ అధ్యక్షత వహించారు. ఈ సభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి మరియు యూనియన్ అధ్యక్షుడు గణేష్‌పండా మాట్లాడుతూ దేశంలో డిపార్ట్‌మెంట్ పేర్లతో కార్మికులు, ఉద్యోగస్తులు వేరేవేరే సంఘాలు పెట్టిన పరిస్థితుల్లో సమ్మెచేసి మైలాన్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు, మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్‌లు, ఆఫీసర్‌లు, కెమిస్టులు కలసి మేడే నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. అమరవీరుల త్యాగాన్ని గుర్తుచేస్తూ, సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీలు కార్మికులను, ఉద్యోగస్తులను ఎలా దోపిడీ చేస్తున్నాయో వివరించారు. నయా ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా గత 20 ఏళ్ళలో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేశారని, యజమానులు సూపర్ లాభాలకోసం కార్మికుల కుదింపు, పరిశ్రమలో కాంట్రాక్టీకరణ చేస్తూ తక్కువ వేతనాలు ఇచ్చి ఎక్కువ లాభాలను సంపాదిస్తున్నారని, అలాగే ప్రభుత్వాలు 1951లో డా॥అక్రాయ్ చేసిన సిఫార్సులను దృష్టిలో పెట్టుకొని కనీస వేతనాన్ని నిర్ణయించాల్సివుండగా 67 సంవత్సరాలు అయినప్పటికీ పాలకులు దానిని చట్టసభలో ఆమోదించలేదని, పాలకులు కీలకమైన దేశ వనరులైన బొగ్గు, చమురు, సహజ వాయువు, ఇనుము, బాక్సైట్‌లను స్వదేశి–విదేశీ దోపిడీ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారనీ, గత రెండు దశాబ్దాలుగా నూతన ఆర్థిక ప్రపంచీకరణ విధానాల అమలుతో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కుల్ని హరించి వేస్తున్నారనీ ఈ నేపథ్యంలో కార్మికులు, రైతులతో కలసి సంఘటిత, ఐక్యపోరాటాలు సాగించాలని కా॥ పండా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో కాంట్రాక్టు కార్మికులు, నాయకులు జి.జమ్మరాజు, ఎన్.రమణ మరియు స్టాఫ్ యూనియన్ నాయకులు సి.హెచ్. రమేష్, జి. మోహనరావు ఇతర యూనియన్ ప్రతినిధులతో పాటు 700 మంది కార్మికులు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు. ✶

కార్మిక నగారా
కార్మికుల మాసపత్రిక
వివరాలకు : **ఆడారి అప్పారావు,** ఎడిటర్,
60-29-47,
జనతాకాలనీ, విశాఖపట్నం

Janasakti (Communist Revolutionaries'Fortnightly) RNI No.8315/63 VJ-077/2013-15

కార్మిక-రైతాంగ ఐక్యపోరాట ఆవశ్యకతను చాటిచెపుతూ నలుచెరగులా ఘనంగా - మేడే

అంతర్జాతీయ కార్మికవర్గ పోరాట దీక్షాదినం మేడే సందర్భంగా 'కార్మికుల, గ్రామీణ పేదల, వృత్తిదారుల, శ్రమజీవుల ఐక్యతా దీక్షాదినం - మేడే వర్ధిల్లాలి! ప్రజాస్వామిక, సోషలిస్టు విప్లవాలను సాధించేందుకు కార్మికవర్గ నాయకత్వాన్ని నెలకొల్పేందుకై కార్మికులందరూ దీక్షపూనే డే-మేడే' అంటూ ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకార్యవర్గం ఇచ్చిన పిలుపుతో వేలాది కరపత్రాలతో విస్తృతంగా కార్మికుల నడుమ రాజకీయ ప్రచారం జరిగింది. ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ కార్మిక యూనియన్ల ఆధ్వర్యంలో, సిపిఐ(ఎం-ఎల్) మరియు రైతుకూలీసంఘం(ఆం.ప్ర.), రైతుకూలీసంఘంల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 15జిల్లాలలోని పలు పట్టణ శ్రామికవాడల్లోనేగాక, గ్రామీణ రైతు-కూలీ, దళితవాడలలోనూ మేడే జెండాలనావిష్కరించారు. ఒకవైపున ఎన్నికల జాతర నేపథ్యంలో, మండుటెండలను లెక్కచేయక ఉత్తేజపూరిత వాతావరణంలో స్ఫూర్తిదాయకంగా ఎర్రజెండాలనెగురవేసి పోరాట ప్రతిన దీసుకున్నారు. వివిధ ప్రాంతాలలో జరిగిన ఈ కార్యక్రమాల వివరాలను సంక్షిప్తంగా అందిస్తున్నాం.

- సంపాదకుడు

శ్రీకాకుళం జిల్లా

శ్రీకాకుళంలోని చౌదరి సత్యన్నారాయణ కాలనీలో రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో కాలనీ వాసులు స్ఫూర్తిదాయకంగా మేడే కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. మేడే జండాని ఆవిష్కరించు కున్నారు. ఈ సందర్భంగా కార్మికులకు సంఘీ భావంగా ప్రజాసాహితి సంపాదకులు పి.ఎస్. నాగరాజు, ఉపాధ్యాయ సంఘ నాయకులు కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ మేడే ప్రాధాన్యతను వివరించారు. అనంతరం బైపాస్‌రోడ్ పెట్రోల్‌బంక్

శ్రీకాకుళం

నుండి పి.ఎస్. కాలనీ, తోటవీధి మీదుగా గుజరాతీపేట జంక్షన్ వరకు **ప్రదర్శన** నిర్వహించి ఆ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి మేడే అమరులకు జోహార్లర్పిస్తూ పెద్దఎత్తున నినదించారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ తాండ్ర అరుణ తదితరులు దీనికి నాయకత్వం వహించారు.

విజయనగరం జిల్లా

విజయనగరం జిల్లా - **బొబ్బిలి**లో ఏఐఎఫ్‌టియు(న్యూ), పికెఎస్, కార్మిక విప్లవ సమితిల అనుబంధ కార్మికసంఘాల ఆధ్వర్యంలో సంయుక్తంగా మేడే నిర్వహించారు. ఆయా సంఘాల కార్యాలయాల వద్ద మేడే జండాలు ఆవిష్కరించిన అనంతరం 500 మంది కార్మికులు బొబ్బిలి పట్టణంలో **ప్రదర్శన** నిర్వహించారు. అనంతరం తాండ్ర పాపారాయుడు విగ్రహం సెంటర్‌లో బహిరంగసభ నిర్వహించారు. ఈ సభలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥

అనంతపురం

ఎస్. ఝాన్సీ, పికెఎస్ నాయకులు కా॥ కొండారెడ్డి, మానవహక్కుల వేదిక నాయకులు బి. జగన్నాథం తదితరులు ప్రసంగించారు.

విజయనగరం పట్టణంలో ఆర్.టి.సి. కాంప్లెక్స్ వద్ద ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకమిటి సభ్యులు కా॥ రెడ్డి నారాయణరావు అధ్యక్షతన మేడే సభ జరిగింది. ఈ సభలో సంఘం రాష్ట్రకమిటి సభ్యులు కా॥ బి. శంకర్రావు ఇంకా ఆటో యూనియన్, రజక సమాఖ్య, అరుణ జూట్‌మిల్ వర్కర్స్ యూనియన్, నారాయణి స్టీల్స్ వర్కర్స్ యూనియన్, అల్యూమినియం స్పిన్నింగ్ అండ్ రోలింగ్ వర్కర్స్ యూనియన్, ఐడిఎస్‌ఎమ్‌టి బలహీనవర్గ వర్తకపు సంఘం, ఎన్‌వైయస్ తదితర యూనియన్‌ల, ప్రజాసంఘాల ప్రతినిధులు ఈ సభలో పాల్గొని ప్రసంగించారు.

అరుణ జూట్‌మిల్, నారాయణి స్టీల్స్, జూట్‌మిల్ ఆటోస్టాండ్, కోర్ట్ ఆటోస్టాండ్, మెసానిక్ టెంపుల్ ఆటోస్టాండ్, పెదమర్రిపాలెం ఆటోస్టాండ్, ఎన్‌సిఎస్ మల్టీప్లెక్స్ ఆటోస్టాండ్, గంటస్థంభం ఆటోస్టాండ్, ఉసిరికల సత్రం ఆటోస్టాండ్, ఐడిఎస్ ఎమ్‌టి షాపింగ్ కాంప్లెక్స్, నెల్లిమర్ల ఆటోస్టాండ్ సెంటర్‌లలో ఉత్తేజపూరిత వాతావరణంలో మేడే జెండా ఆవిష్కరణలు జరిగాయి. ఆయా యూనియన్‌ల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విజయనగరం జిల్లాలో-రైతుకూలీసంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో **దుగ్గేరు, మూలవలస, పనసభద్ర, పెదవూటగెడ్డ** గ్రామాలలో స్థానిక సంఘ

అనంతపురం

నాయకుల ఆధ్వర్యంలో మేడే సందర్భంగా ఎర్రజెండాలను ఆవిష్కరించారు.

మక్కువ గ్రామంలో - ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ ఏరియా కళాసీ సంఘం ఆధ్వర్యంలో మేడేనాడు మార్కెట్ సెంటర్‌లో సంఘ అధ్యక్షులు కా॥ పాపారావు ఎర్రజెండాను ఎగురవేశారు. అనంతరం 200 మంది కార్మికులు పట్టణవీధుల్లో, ఎర్రజెండాలతో, నినాదాలతో **ప్రదర్శన** నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ప్రజాకళాకారుల సమాఖ్య కళారూపాలు, పాటలు ప్రజల్ని ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన మేడే సభలో రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి కా॥ వర్మ, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ గోపాలం, వి. రామమూర్తి తదితరులు కార్మికవర్గ రాజ్యసాధన లక్ష్యంగా కార్మిక - కర్షక ఐక్యత పునాదిగా ఐక్యపోరాటాలకు సమాయత్తం కావాలని పిలుపు నిచ్చారు.

ఒంగోలు

కొమరాడ మండలం-కోటిపాంలో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో సంఘం జిల్లా నాయకులు కా॥ ఎజ్జుగుంపుస్వామి మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కామ్రేడ్స్ శ్రీను నాయుడు, కద్రక వెంకటస్వామి కార్మిక - రైతాంగ ఐక్యపోరాటఆవశ్యకతను వివరిస్తూ ప్రసంగించారు.

పెదశాఖ; బల్లపాడు సెంటర్లలో మేడే జెండాలను ఆవిష్కరించారు. కొమరాడ మండల భవననిర్మాణ కార్మికసంఘంఆధ్వర్యంలో విక్రంపురం గ్రామంలో; **పార్వతీపురం**లో వరహాలగెడ్డ బడ్డీ వ్యాపారుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో కోపరేటివ్ బ్యాంక్ సెంటర్‌లో ఎర్రజెండాలు ఎగుర వేశారు. ఈ కార్యక్రమాలలో సంఘం జిల్లా

విజయ
నగరం

నాయకులు చోడిసాంబ, కిత్తన్న, మోనంగి భాస్కరరావు మరియు ఆయా యూనియన్ల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

తదనంతరం, మార్కెట్టుయార్డు నుండి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు **ప్రదర్శన** జరిగింది. ఈ సభలో ముఖ్యవక్తగా ప్రసంగించిన రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ యస్. ఝాన్సి మాట్లాడుతూ పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలన్నింటిలో అసంతృప్తి, నిరసన, మిలిటెంట్ ఆందోళనలు సాగుతున్నాయని, మన దేశంలో కార్మికులు-రైతుకూలీ గ్రామీణ పేదలంతా సంఘటితపోరాటాలు సాగించాలని మేడేఅమరులకు జోహార్లర్పిస్తూ ఆమె పిలుపు నిచ్చారు. ఈ సభలో ఇంకా కామ్రేడ్స్ ఇల్లా రామిరెడ్డి, బి. నర్సింగరావు, సంఘం, పోలినాయుడు తదితరులు మాట్లాడారు. బాల కళాకారుల పాటలు ఆకట్టుకున్నాయి.


వరంగల్

విశాఖ జిల్లా

విశాఖజిల్లా - **అనకాపల్లి మండలం**, గుంకలలోవ మరియు డ్రిల్లర్స్ కాలనీలలో మేడే జెండా ఆవిష్కరణలు, అనంతరం సభలు జరిగాయి. మేడే పోరాటస్ఫూర్తితో ఈ ప్రాంత కార్మికులు తమ పని పరిస్థితుల, జీవన పరిస్థితుల మెరుగుదల కోసం పోరాడేందుకు ప్రతిన తీసుకున్నారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ చవితిని రమణ, గడి సూర్యారావులతోపాటుగా ఓపిడిఆర్, జనసాహితి నాయకులు, ప్రజాతంత్ర వాదులు కార్మికులకు సంఘీభావంగాపాల్గొని ప్రసంగించారు.

కరీంనగర్

దర్జినగర్, డ్రిల్లర్స్ కాలని పరిసర ప్రాంతాల క్వారీ కార్మికులు ఈ సభలలో పాల్గొన్నారు.

చోడవరం మండలం - గోవాడలో ఏఐఎఫ్‌టియు(న్యూ) ఏరియా శాఖ ఆధ్వర్యంలో జరిగిన మేడే సభకు దామునాపల్లి, చోడవరం, వరహాపురం, జుత్తాడ, లక్కవరం, అందేరుపురం, గోవాడ తదితర గ్రామాల నుండి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తొలుత గోవాడ గ్రామ వీధులలో కార్మికులంతా నినాదాలుచేస్తూ **ప్రదర్శన**గా కదంతొక్కారు. షుగర్‌ఫ్యాక్టరీ ఎదురుగా మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సభలో, ప్రదర్శనలో ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ఐతిరెడ్డి అప్పల నాయుడు, కా॥నాగేశ్వరరావు; స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కా॥లక్ష్మీకుమారి, ఇంకా చోడవరం, లక్కవరం ఏరియా, దామునాపల్లి భవననిర్మాణ కార్మికసంఘాల నాయకులు పాల్గొని మేడే ఆవశ్య కతను వివరిస్తూ ఉత్తేజపూరితంగా ప్రసంగించారు.

కరీంనగర్

తూర్పుగోదావరి జిల్లా

తూర్పుగోదావరి జిల్లా **నేలటూరు** అమర వీరుల స్థూపం; **మండపేట మండలం** - మారేడుబాకలోని కా॥ గుబ్బల సుబ్బారావు స్మారక స్థూపం; **యు. కొత్తపల్లి మండలం** - వాకతిప్ప; **రంగంపేట మండలం** - కోవిడు సెంటర్లలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో స్ఫూర్తిదాయకంగా మేడేజెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కామ్రేడ్స్ రాములమ్మ, గుబ్బం అమ్మాజీ, జి. సూర్యనారాయణ, బలరాంలు మాట్లాడుతూ రంగంపేట, పెద్దాపురం, జగ్గంపేట మండలాలలో దేవస్థాన భూముల స్వాధీనం కోసం రైతు, కూలీలు సాగించిన పోరాటాన్ని వివరించారు.

(తరువాయి 6వ పేజీలో)

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010 and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010